చదవండి.. చదివించండి..
నేటి శుభోదయ
ప్రతిక్షణం.. ప్రజల కోసం...
నిజమైన వార్తలు... నమ్మకమైన పత్రిక
నిరపేక్ష వార్తలు | నిజాయితీ జర్నలిజం | ప్రజల గొంతుక
వార్తలు, ప్రకటనల కోసం సంప్రదించండి
మా వెబ్‌సైట్ www.netishubhodaya.com
వాట్సాప్ 96965 71571
మీ నమ్మకం.. మా బాధ్యత.. శుభోదయంతో ప్రతి ఉదయం ప్రగతివైపు!

RNI TELTEL/2024/89620
తెలంగాణ
# నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

GK MEDIA Voice of People
CHANNEL NO. 433
SSLC CABLE NETWORK
SSLC కేబుల్ నెట్‌వర్క్‌లో వస్తుంది

ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 342 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | ఆదివారం 20 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-



## భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

### - ప్రధాని మోదీ

- 20వ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాల పంపిణీ
- భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరణ
- చిన్న నగరాల్లోనూ స్టార్టప్‌లు వస్తుండటం శుభపరిణామం అన్న ప్రధాని
- రూ. లక్ష కోట్లతో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభం
- కొత్తగా చేరిన ఉద్యోగులకు నిరంతర అభ్యాసంపై ప్రధాని మోదీ సూచన

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. 20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు...

మిగతా 2వ పేజీ లో..

## వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి

### - ప్రజలను కోరిన సీఎం రేవంత్ రెడ్డి

- ప్రాజెక్టును పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శ
- భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఏఏఐకి భూమి అప్పగింత
- మూడు ప్యాకేజీలుగా పనులు, డిసెంబర్‌లో శంకుస్థాపన చేసేందుకు ప్రణాళిక



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వరంగల్ (మామునూరు) విమానాశ్రయానికి సముచితమైన పేరును సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ ప్రాజెక్టును తమ ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు, కుటుంబ ప్రయోజనాలపైనే ....

మిగతా 2 వ పేజీ లో..

## అండమాన్‌లో అల్పపీడనం..

### మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

- ఉత్తర అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం
- వాయుగుండంగా బలపడి ఉత్తరాంధ్ర తీరం వైపు పయనం
- సోమవారం నుంచి కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- తీరం వెంబడి బలమైన ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరిక

2



## ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు,

### ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు : హరీశ్‌రావు

- శ్రీశైలం నుంచి 84 టీఎంసీలు వాడామన్నది పచ్చి అబద్ధం
- గత మూడేళ్లలో ఏపీ 718, తెలంగాణ 216 టీఎంసీలే వాడిందన్న హరీశ్ రావు
- రాష్ట్ర చరిత్రలోనే ఈ ఏడాది అత్యల్పంగా కృష్ణా జలాల వినియోగం
- నీళ్లు, మోటార్లు ఉన్నా ప్రభుత్వం వాడుకోలేకపోయిందని విమర్శ

2



## వంటగ్యాస్ సబ్సిడీకి బయోమెట్రిక్ తప్పనిసరి..

### అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్!

- వంటగ్యాస్ సబ్సిడీకి బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ తప్పనిసరి
- 2026 అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధన అమల్లోకి రానుంది
- బయోమెట్రిక్ పూర్తి చేయని వారికి మార్కెట్ ధరకే సిలిండర్ సరఫరా

2




## జన్వాడ ఫాంహౌస్..

### నాలాపై కట్టిన అక్రమ నిర్మాణమే : కాంగ్రెస్ ఎంపీలు



- జన్వాడ ఫాంహౌస్ ను పరిశీలించిన కాంగ్రెస్ ఎంపీలు
- ఈ ఫాంహౌస్ నిర్మాణానికి అనుమతులు లేవన్న ఎంపీ చామల
- అసలు యజమాని ఎవరనే దానిపై అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్య

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలోని వివాదాస్పద ఫాంహౌస్‌ను (కేటీఆర్ ఫాంహౌస్ గా ఆరోపణలు) కాంగ్రెస్ పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యుల బృందం ఈరోజు నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనకు దిగి కాంగ్రెస్ బృందాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ పరిశీలన అనంతరం మాట్లాడిన నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి...

2

## అనర్హత తీర్పుపై.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్

- హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్
- తన అనర్హతను సవాల్ చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరపున పోటీ చేయడమే కారణం
- ఇప్పటికే సుప్రీంలో కేవియట్ దాఖలు చేసిన ఇతర ఎమ్మెల్యేలు



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. బీఆర్ఎస్ తరపున గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై శుక్రవారం హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయం విదితమే. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పు నిచ్చింది. ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే వర్తిస్తుందని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ గతంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాలని, తీర్పు ప్రతులను స్పీకర్ కార్యాలయానికి, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు, ఇదే వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అంశంపై తమ వాదనలు వినకుండా ఎలాంటి ఏకపక్ష నిర్ణయం తీసుకోవద్దని వారు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

## బండి సంజయ్ మానవత్వం.. కాన్వాయ్ ఆపి

### ప్రమాద బాధితులకు సాయం

- రాజీవ్ రహదారిపై ప్రమాద బాధితులను ఆదుకున్న బండి
- డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన కారు.. బాలికకు తీవ్ర గాయాలు
- ఘటనను గమనించి తన కాన్వాయ్‌ను ఆపిన కేంద్ర మంత్రి
- గాయపడిన వారిని తన భద్రతా వాహనంలో ఆసుపత్రికి తరలింపు



2

## ఎర్రవల్లి భూముల సర్వేలో మరో ట్విస్ట్..

### 180 ఎకరాలు మావేనంటున్న రైతులు!

- ఎర్రవల్లి 325 సర్వే నంబర్‌పై కొనసాగుతున్న పరిశీలన
- మొత్తం 388 ఎకరాల భూములపై అధికారుల సర్వే
- 180 ఎకరాలు తమవేనంటున్న వెంకటాపూర్ రైతులు
- పాత ఖాస్రా, సేత్వార్ రికార్డులు పరిశీలించాలని డిమాండ్
- ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజ్‌పూర్ హద్దుల పరిశీలన
- రైతులకు నోటీసుల తర్వాత ఎంజాయ్‌మెంట్ సర్వే

2



## వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి
# పేరు సూచించండి
**- ప్రజలను కోరిన సీఎం రేవంత్ రెడ్డి**

**మొదటిపేజీ తరువాయి..** దృష్టి సారించిందని, ప్రజలకు అత్యవసరమైన విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వం విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం రూ. 295 కోట్లు కేటాయించి, ఆ భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు (ఏఏఐ) అప్పగించినట్లు తెలిపారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉపాధి, పెట్టుబడులకు ఒక నూతన ముఖద్వారమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానమవుతున్న తెలంగాణకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

**మూడు ప్యాకేజీల్లో పనులు**

విమానాశ్రయ నిర్మాణ పనులను ఏఏఐ మూడు ప్యాకేజీలుగా చేపడుతోంది. మొదటి ప్యాకేజీలో 953 ఎకరాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణం, రెండో ప్యాకేజీలో రన్‌వే, పార్కింగ్, డ్రైనేజీ వ్యవస్థల పనులు ఉంటాయి. మూడో ప్యాకేజీలో భాగంగా రూ. 213.59 కోట్ల అంచనా వ్యయంతో టెర్మినల్ భవనం, ఏటీసీ టవర్, ఫైర్ స్టేషన్, పవర్ సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. వీటికి సంబంధించిన టెండర్లను నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డిసెంబర్‌లో విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

## భారత యువత సత్తాకు
# స్టార్టప్‌లే నిదర్శనం
**- ప్రధాని మోదీ**

**మొదటిపేజీ తరువాయి..** ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది" అని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. "ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి" అని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. "మీరు, మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలి. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలి" అని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి'ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'iGOT కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరే వారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని పేర్కొన్నారు.

# జన్వాడ ఫాంహౌస్..
## నాలాపై కట్టిన అక్రమ నిర్మాణమే
**: కాంగ్రెస్ ఎంపీలు**

**మొదటిపేజీ తరువాయి..** జన్వాడ ఫాంహౌస్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని, మురుగునీటి కాలువ (నాలా) పైనే ఈ అక్రమ నిర్మాణాన్ని చేపట్టారని సంచలన ఆరోపణలు చేశారు. ఇంత పెద్ద ఎత్తున నిబంధనలకు విరుద్ధంగా విస్తరించిన ఈ ఫాంహౌస్ భూముల వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు దాగి ఉన్నాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేటీఆర్ స్నేహితుడైన ప్రదీప్ రెడ్డి పేరుతో ఈ భూములు ఉన్నప్పటికీ, అసలు యజమానులెవరనే దానిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. గతంలో సత్యం రామలింగరాజుకు చెందిన భూముల్లోనే ఈ ఫాంహౌస్ నిర్మించారని, శతభిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో ఉన్న ఈ స్థలాల్లో కేటీఆర్ అర్ధాంగి శైలిమతో పాటు ఆయన అత్తగారి పేరిట కూడా భూములు ఉన్నాయని ఆరోపించారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్న హయాంలో తన అధికార దుర్వినియోగానికి పాల్పడి ఈ అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహించారని, గతంలో ఈ ఫాంహౌస్ దగ్గర డ్రోన్ కెమెరా ఎగురవేసినందుకు రేవంత్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించిన విషయాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు గుర్తుచేశారు.

## ఎర్రవల్లి భూముల సర్వేలో మరో ట్విస్ట్.. 180 ఎకరాలు మావేనంటున్న రైతులు!

**మొదటిపేజీ తరువాయి..** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ సమీపంలోని ప్రభుత్వ భూముల సర్వేలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో ఉన్న 388 ఎకరాల భూమిపై రెవెన్యూ, సర్వే అధికారులు చేపట్టిన సర్వే మూడో రోజుకు చేరుకోగా, ఈ వివాదంలోకి పొరుగున ఉన్న వెంకటాపూర్ గ్రామస్థులు ప్రవేశించారు. సర్వే చేస్తున్న భూమిలో తమ వాటా కూడా ఉందని వారు కొత్త వాదనను తెరపైకి తెచ్చారు. వివరాల్లోకి వెళితే, సర్వే నంబర్ 325 కింద ఉన్న మొత్తం 388 ఎకరాల భూమిలో కేవలం 250 ఎకరాలు మాత్రమే ఎర్రవల్లికి చెందినవని, మిగిలిన సుమారు 180 ఎకరాలు తమ వెంకటాపూర్ గ్రామ పరిధిలోకి వస్తాయని గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు పొరపాటున తమ గ్రామ పరిధిలోని భూమిని ఎర్రవల్లి సర్వే నంబర్‌లో కలిపారని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఖస్రా, సేత్వార్ పహాణీ వంటి పాత రెవెన్యూ రికార్డుల ఆధారంగా సర్వేను పక్కాగా నిర్వహించి, తమ భూమిని గుర్తించి వేరు చేయాలని వారు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు, అధికారులు తమ సర్వే ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ భూమిని ప్రస్తుతం సాగు చేస్తున్న రైతులను గుర్తించే పనిలో భాగంగా వారికి నోటీసులు జారీ చేయడం ప్రారంభించారు. మొత్తం 215 మందికి నోటీసులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకో గా, శనివారం ఒక్కరోజే సుమారు 50 మందికి నోటీసులు అందజేశారు. నిర్దేశిత తేదీల్లో రైతులు తమ భూముల వద్దకు వచ్చి, సంబంధిత వివరాలు అందించాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి నాలుగు దశల్లో సర్వేను కొనసాగించనున్నట్లు అధికారులు తెలిపారు. నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయ్యాక, క్షేత్రస్థాయిలో ప్రస్తుతం భూమిని సాగు చేస్తున్న, అనుభవంలో ఉన్న రైతులను గుర్తించేందుకు 'ఎంజాయ్‌మెంట్ సర్వే' కూడా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అయితే, వెంకటాపూర్ గ్రామస్థుల వాదనతో ఈ సర్వే ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారింది. రెండు గ్రామాల మధ్య నెలకొన్న ఈ సరిహద్దు వివాదాన్ని అధికారులు ఎలా పరిష్కరిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## అండమాన్‌లో అల్పపీడనం.. మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

**మొదటిపేజీ తరువాయి..** ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి వర్ష సూచన వెలువడింది. ఉత్తర అండమాన్, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇది రానున్న రోజుల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ కథనం ప్రకారం, ప్రస్తుతం అండమాన్‌లో కేంద్రీకృతమైన ఈ అల్పపీడనం క్రమంగా బలపడనుంది. సోమవారం నాటికి ఇది వాయుగుండంగా, మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి, బుధవారం ఉదయానికి దక్షిణ ఒడిశా – ఉత్తరాంధ్ర తీరాలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం మారనుంది. ఆదివారం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, పలుచోట్ల విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపింది. ముఖ్యంగా సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో రానున్న ఐదు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు : హరీశ్‌రావు

**మొదటిపేజీ తరువాయి..** మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చినవి కావని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన కాంగ్రెస్ మార్క్ కరవు అని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాలు వినియోగంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ఈ ఏడాది శ్రీశైలం నుంచి 84 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పేర్కొనడం పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. వాస్తవానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటివరకు కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే మళ్లించారని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి పథకంలోని ఐదు మోటార్లలో కేవలం రెండే పని చేస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గత మూడేళ్లలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 216 టీఎంసీలకే పరిమితమైందని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే అత్యంత తక్కువ స్థాయిలో కృష్ణా జలాలను వినియోగించుకోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. "నీళ్లు అందుబాటులో ఉన్నాయి, ఎత్తిపోసేందుకు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ నీటిని మళ్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. అందుకే ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నా, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమని దుయ్యబట్టారు.

## వంటగ్యాస్ సబ్సిడీకి బయోమెట్రిక్ తప్పనిసరి.. అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్!

**మొదటిపేజీ తరువాయి..** దేశీయ వంటగ్యాస్ (ఎల్పీజీ) వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాయితీ ధరపై వంటగ్యాస్ సిలిండర్లను పొందేందుకు 2026 అక్టోబర్ 1 నాటికి బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ (బీఏఏ) ప్రక్రియను పూర్తి చేయడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అర్హులైన కుటుంబాలకు మాత్రమే సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడటంతో పాటు, గృహ అవసరాల సిలిండర్లు వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు అక్రమంగా మళ్లకుండా నిరోధించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వెల్లడించింది. ఆధార్‌తో బయోమెట్రిక్ అనుసంధానం చేయడం ద్వారా డూప్లికేట్, అనర్హమైన కనెక్షన్లను సులభంగా గుర్తించి తొలగించే అవకాశం ఉంటుందని పేర్కొంది. వినియోగదారులు వివిధ మార్గాల్లో ఈ బయోమెట్రిక్ ప్రక్రియను పూర్తి చేసే సౌలభ్యం ఉంది. సిలిండర్ డెలివరీ చేసే సమయంలో సిబ్బంది వద్ద ఉండే మొబైల్ యాప్ ద్వారా, లేదా నేరుగా సమీపంలోని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కార్యాలయాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. వీటితో పాటు సంబంధిత ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల అధికారిక మొబైల్ యాప్‌ల (ఇండేన్‌కు ఇండియన్ ఆయిల్ వన్, భారత్‌గ్యాస్‌కు హలోబీపీసీఎల్, హెచ్‌పీ గ్యాస్‌కు హెచ్‌పీ పే) ద్వారా కూడా వినియోగదారులు స్వయంగా ప్రామాణీకరణ చేసుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. ఇప్పటికే బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని పక్షంలో సబ్సిడీ వర్తించదు. అటువంటి వారు సిలిండర్‌ను మార్కెట్ ధరకే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 19 నాటికి దేశవ్యాప్తంగా దాదాపు 90 శాతం మంది, అంటే 27.43 కోట్ల మంది వినియోగదారులు ఇప్పటికే బయోమెట్రిక్ ప్రామాణీకరణను పూర్తి చేశారని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్‌పై సుమారు రూ. 210 వరకు రాయితీ లభిస్తోంది. కేవలం అర్హులైన లబ్దిదారులకు మాత్రమే ఈ ప్రయోజనం చేకూరేలా చూడటం ప్రభుత్వ ఆర్థిక సుస్థిరతకు అత్యవసరమని కేంద్ర ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొంది

## వంటగ్యాస్ సబ్సిడీకి బయోమెట్రిక్ తప్పనిసరి.. అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్!

**మొదటిపేజీ తరువాయి..** కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ మానవత్వాన్ని చాటుకున్నారు. మార్గమధ్యం లో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని గమనించిన ఆయన, వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదానికి గురైన బాధితులను తన భద్రతా వాహనంలోనే ఆసుపత్రికి తరలించి అండగా నిలిచారు. శనివారం సిద్దిపేట నుంచి గజ్వేల్ వైపు వెళుతున్న ఒక కారు రాజీవ్ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదం సమయంలో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న వ్యక్తి, ముందు సీటులో ఉన్న ఆయన భార్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే, వెనుక సీటులో కూర్చున్న వారి కుమార్తెకు తల, ముక్కు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో సిరిసిల్ల వైపు వెళుతున్న బండి సంజయ్ ఈ ప్రమాదాన్ని గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి, భద్రతా సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో చిక్కుకున్న బాధితులను బయటకు తీయడంలో స్వయంగా సహాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన బాలికను, ఆమె తల్లిదండ్రులను వెంటనే తన కాన్వాయ్‌లోని భద్రతా వాహనంలో ఆసుపత్రికి తరలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. ఆపదలో ఉన్నవారిని సకాలంలో ఆదుకున్న బండి సంజయ్ చొరవను పలువురు అభినందించారు.

# రావుట్ల గ్రామంలో ఘనంగా చాయ్ పే చర్చ" కార్యక్రమం



**నిజామాబాద్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** భారతీయ జనతా పార్టీ సిరికొండ మండల కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు రావుట్ల గ్రామంలో ఖుషి శైలేష్ గారు మరియు పోతుగంటి మధు గారి స్వగృహంలో "చాయ్ పే చర్చ" కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు బారి సంఖ్యలో పాల్గొని గ్రామంలోని ప్రజా సమస్యలు, మౌలిక వసతులు, గ్రామాభివృద్ధి, ప్రజల అవసరాలు తదితర అంశాలపై ఆత్మీయంగా చర్చించారు. ఈ సందర్భంగా బి జె పి జిల్లా ఉపాధ్యక్షులు నక్క రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు, అభిప్రాయాలు, సూచనలు తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం "చాయ్ పే చర్చ" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై చర్చించారు. గ్రామాభివృద్ధికి సంబంధించి ప్రజల సూచనలు, అభిప్రాయాలను సేకరించి వాటిని సంబంధిత వేదికల ద్వారా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు.ప్రజల మాట వినడం సమస్యలను తెలుసుకోవడం పరిష్కార మార్గాలపై చర్చించడం అనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువగా ఉండేందుకు భారతీయ జనతా పార్టీ సిరికొండ మండల కమిటీ కృషి చేస్తుందని తెలిపారు.గ్రామ ప్రజలు తమ ప్రాంతంలోని సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సూచనలు మరియు అభిప్రాయాలను నిర్మొహమాటంగా తెలియజేయాలని నాయకులు కోరారు. ప్రజల భాగస్వామ్యంతో స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సిరికొండ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి మరియు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు

# 6వ వార్డులో ఘనంగా వినాయక నిమజ్జనం



**షాబాద్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** షాబాద్ గ్రామంలోని 6వ వార్డులో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూకు భక్తుల్లో విశేష స్పందన లభించింది. లడ్డూ వేలంలో రూ. 35,101లకు బీజేపీ నాయకుడు రాము లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ. .వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సంవత్సరం వినాయకుని లడ్డూను సొంతం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు వినాయక చవితి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించిన నిర్వాహకులను, సహకరించిన వారిని ఆయన అభినందించారు. అనంతరం ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం కొనసాగింది

# హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- **సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి రామకృష్ణ**



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయనిసిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి రామకృష్ణ అన్నారు. శనివారం సిరికొండ మండలం లోని గడ్కోల్ గ్రామం లో జరిగిన ప్రెస్ మీట్ లో అయన మాట్లాడుతు ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం ఆ తర్వాత విస్మరించడం పాలకవర్గ పార్టీలకు అలవాటుగా మారిందని అందులో భాగంగానే కేంద్రా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను పూర్తిగా విస్మరించే అన్నారు. 13 ఏళ్లలో అధికారంలో ఉన్న మోడీ దేశ ప్రజలకు ముఖ్యంగా రైతాంగానికి మహిళలకు కార్మికులకు ఏ వర్గానికి కూడా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పట్టించుకోలేదన్నారు. ఎమ్మెస్ పి చట్టం చేస్తానని రైతులను మోసం చేశాడన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు నిరుద్యోగులకు ఇస్తానని ఉన్న ఉద్యోగాలే ఊడగొట్టే ప్రయత్నం చేశాడు అన్నారు. హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న మోడీ ప్రజలపై అనేక పన్నులు విధిస్తూ ప్రత్యక్ష దాడులకు పూనుకున్నదన్నారు. యూపిఐ చార్జీలు మొత్తం ప్రజలకు ఇంకా సమస్యల్లో కూరుకుపోయిన చేశాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారం లోకి రాక ముందు అనేక వాగ్దానాలు ఇచ్చి అమలు చేయకుండా తపించుకున్నారన్నారు. మహిలకు గృహాలక్ష్మి , రుణమాఫీ పూర్తి గా జరగలేదు అని, బోనస్ కూడా ఇవ్వకుండా చేతులు దులుపుకున్నారున్నారు.పలు అంశాలపై అవగాహనాను రాజకీయ శిక్షణ తరగతులు సభ్యులకు కల్పించింది అన్నారు. జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై చర్చించడం జరిగింది అని, అయన అన్నారు. బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించాడానికి ప్రతిఒక్క కార్యకర్త పనిచేయాలని ప్రతినిధులకు పిలుపును ఇచ్చామని అయన తెలిపారు. ఈ కార్యక్రమం లో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆర్ దామోదర్, బి బాబన్న, బి కిశోర్, మండల నాయకులు ఎం లింబాద్రి, ఎస్ కిషోర్, ఎం అనీష్, ఎల్ ఆశీస్, జే రాజు లు పాల్గొన్నారు.

# సోహం అకాడమీ ఆధ్వర్యంలో రోబోటిక్స్ వర్క్‌షాప్ తెలంగాణ ఆదర్శ పాఠశాల లో ఘనంగా నిర్వహణ



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** సిరికొండలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల & కళాశాలలో శనివారం (19-09-2026) రోజున సోహం అకాడమీ ఆధ్వర్యంలో 8వ, 9వ తరగతి విద్యార్థులకు రోబోటిక్స్‌పై ప్రత్యేక వర్క్‌షాప్ అత్యంత కోలాహలంగా నిర్వహించబడింది.విద్యార్థులలో సాంకేతిక విజ్ఞానం, సృజనాత్మక ఆలోచనలు, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది.ఈ వర్క్‌షాప్‌లో మొత్తం 106 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని రోబోటిక్స్ ప్రాథమిక అంశాలు, ప్రాక్టికల్ ప్రాజెక్టులపై అవగాహన పెంచుకున్నారు. విద్యార్థుల ప్రతిభ, ఆసక్తిని బట్టి 24 మందిని ప్రత్యేకంగా 'రోబోటిక్స్ క్లబ్'కు ఎంపిక చేశారు. రోబోటిక్స్ క్లబ్ కెప్టెన్‌గా 9వ తరగతి విద్యార్థి శ్రీ ఆదిత్య, వైస్ కెప్టెన్‌గా 8వ తరగతి విద్యార్థి హర్ష వర్ధన్ ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఇన్‌చార్జులు సౌమిత్రి, లావణ్య , సోహం అకాడమీ టీం హెడ్ వినయ్ రెడ్డి మరియు అకాడమీ బృంద సభ్యులు పాల్గొని విద్యార్థులకు రోబోటిక్స్ పరిజ్ఞానాన్ని, ప్రత్యక్ష అనుభవాన్ని అందించారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యను మరింత చేరువ చేస్తూ, వారిలోని దాగివున్న నైపుణ్యాలను వెలికితీసేందుకు కృషి చేస్తున్న సోహం అకాడమీ యాజమాన్యానికి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రాష్ట్రంలో కరువు మండలాలను ప్రకటించి నష్టపరిహారం ఇవ్వాలని ధర్పల్లి ఎమ్మార్వో గారికి వినతిపత్రం



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** రాష్ట్రంలో అనావృష్టి కారణంగా కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి రాష్ట్రంలో 621 మండలాలకు గాను 376 మండలాలు కరువు బారిన పడ్డాయి భూగర్భ జలాలు తగ్గిపోయి బావులలో బోర్లలో నీళ్లు అడుగంటుతున్నాయి గత సంవత్సరం కంటే ఈసారి వరి సాగు 12 లక్షల ఎకరాలు తగ్గింది పత్తి ఇతర మెట్ట పంటలు పూత ఖాతా దశకు వస్తున్న సెప్టెంబర్ నెలలో మరి తక్కువ వర్షాలు పడడం వలన భూమిలో తేమ తగ్గి పైర్ల ఎదుగుదల కూడా ఆగిపోయింది కరువు నివారణ చర్యలు భాగంగా రేషన్ షాపుల ద్వారా పప్పులు నూనె కారం తదితర 14 రకాల నిత్యవసర సరుకులు అందించాలని కరువు మండలాలను గుర్తించి నష్టన్ని అంచనా వేయాలని రైతులకు జరిగిన నష్టం ప్రతిపాదికపై పరిహారం అందించాలని ఆగిపోయిన మంచిప్ప 21 ప్యాకేజీ పనులను వేగవంతం చేసి 84 వేల ఎకరాలకు నీరు అందించి రైతులను కాపాడాలని రైతు కూలీలకు ప్రభుత్వమిచ్చిన హామీ సంవత్సరానికి 12,000 వేల రూపాయలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్ ఆర్ ఓ కు వినతి పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమం లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ భీంగల్ ఎరియా కార్యదర్శి వి బాల య్య అఖిల భారత రైతు కూలి సంఘం డివిజన్ అధ్యక్షులు మందాపురం నర్సాగౌడ్ ధర్పల్లి మండల అధ్యక్షులు నిమ్మల భూమేష్ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు

# స్కూల్ ఫస్ట్, సెకండ్ మార్కులు సాధించిన విద్యార్థులు ఫ్లైట్లో ఎగిరారు.

- **ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్ శంకర్ నాయక్.**
- **గణిత ఉపాధ్యాయుడు నరేందర్ రెడ్డి.**
- **విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** యాచారం మండల పరిధిలో గ్రామ నల్లవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపల్ శంకర్ నాయక్, ఆధ్వర్యంలో ప్రతినెల మూడవ శనివారం రోజున ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సంభాషణ జరుగుతుంది. కావున 2026.10వ తరగతి విద్యార్థులు రాసిన ఎగ్జామ్ లో స్కూల్ ఫస్ట్ మార్కులతో దాసరి మహేష్ 552, సెకండ్ మార్కులు 551 పై చిలుకు మార్కులు సాధించిన వారికి స్కూల్లో గణిత ఉపాధ్యాయుడు నరేందర్ రెడ్డి, దాసరి పర్వతాలువిద్యార్థులకు విమానంలో తిరుపతికి తీసుకువెళ్తామని మాట ఇచ్చారు.తను ఇచ్చిన మాట ప్రకారం పై మార్కులు సాధించిన విద్యార్థి పవన్ కుమార్ కి తిరుపతి తీసుకెళ్లారు.విద్యార్థి తండ్రి ఏమే చంద్రయ్య,పేరెంట్స్ మీటింగ్లో ఉపాధ్యాయులకు శాలువాతో సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఉడుదల జంగయ్య,జి సత్తయ్య,బి రాజు ,జి విజయ్ ,జి మహేష్,రాజు ఎస్.కె అబ్బాస్,స్కూల్ చైర్మన్ రత్నాల పద్మ గ్రామస్తులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్పల్లి వారాంతపు సంత ప్రాంతంలో మెరుగైన రహదారి సౌకర్యాల కల్పన



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** ధర్పల్లి మండల కేంద్రంలోని అంగడి బజార్ ప్రాంతంలో నిర్వహించే వారాంతపు సంతలో ప్రజలకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు శనివారం రహదారి అభివృద్ధి పనులు చేపట్టారు. రోడ్డు బాటను సుగమం చేయడానికి మొరం వేసే పనులను ప్రారంభించారు. ఈ పనులను గ్రామ సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్, వీడీసీ ఛైర్మన్ ఆర్మూర్ రంజిత్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వారాంతపు సంతకు వచ్చే ప్రజలు, దూరప్రాంతాల నుండి వచ్చే వ్యాపారస్థులు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలను నివారించడమే ధ్యేయంగా ఈ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రయాణం, రవాణా సులభతరం చేసేందుకు రహదారి సౌకర్యాలను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుంది?

- **ఏళ్లు గడుస్తున్నా పనులు ముందుకు సాగక భక్తుల్లో అసహనం**



**వికారాబాద్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: కుల్కచర్ల–మరికల్ ప్రధాన రహదారి పక్కన నిర్మాణంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో భక్తులు, గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ నిర్మాణం పూర్తికాకపోవడంతో స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు.గతంలో ఇదే ప్రాంతంలో ఉన్న చిన్న ఆలయంలో నిత్య పూజలు కొనసాగేవని, పాత ఆలయాన్ని తొలగించి కొత్త ఆలయాన్ని నిర్మిస్తామని నిర్వాహకులు నిర్ణయించినట్లు భక్తులు తెలిపారు. అయితే పునర్నిర్మాణ పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా ఆలయం పూర్తికాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని కళాశాలలకు వచ్చే విద్యార్థులు, స్థానిక ప్రజలు కూడా స్వామివారి దర్శనం కోసం ఇక్కడికి వస్తుంటారని తెలిపారు.ఇకనైనా ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని నిర్వాహకులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులను భక్తులు కోరుతున్నారు.

# విఘ్నేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలిమున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య



**వికారాబాద్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** వికారాబాద్: పట్టణంలోని 32వ వార్డు శివరాంనగర్ కాలనీలో కౌన్సిలర్ బాదం అనురాధ అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, వైస్ చైర్మన్ మల్లేశం, మాజీ వైస్ చైర్మన్ సి. రమేష్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా గడ్డం అనన్య మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నిమజ్జన కార్యక్రమాల సమయంలో చిన్నారుల పట్ల తల్లిదండ్రులు, నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. యువత ఐక్యంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొని, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. విఘ్నేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జున గౌడ్, రాకేష్, కాకి విజయలక్ష్మి , అనంతలక్ష్మి , నాయకులు శ్రీకాంత్, మధుకర్, నాగరాజు జీలని, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మౌలాలి, మల్కాజిగిరిలో కమిషనర్ విస్తృత తనిఖీలు

- **నిమజ్జన ఏర్పాట్లు, వీధిదీపాలు, రోడ్ల నిర్వహణపై ఆరా**



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్ శనివారం మౌలాలి, మల్కాజిగిరి సర్కిళ్లలో విస్తృతంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి, నిర్వహణ పనుల పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.మౌలాలి వార్డులో రోడ్డు ప్యాచ్ పనులకు వినియోగించే షెల్ మ్యాక్ బ్యాగుల నిల్వ, నూతన వీధిదీపాలు, ఇతర పరికరాల నిర్వహణను కమిషనర్ పరిశీలించారు. అందుబాటులో ఉన్న సామగ్రిని అవసరమైన ప్రాంతాల్లో సకాలంలో వినియోగించాలని, పరికరాలను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.వీధిదీపాల ఏర్పాటుకు ఆదేశంవెంకటేశ్వరనగర్‌లో స్థానికులతో మాట్లాడిన కమిషనర్.. రాత్రివేళల్లో వీధిదీపాలు లేక ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ప్రజల భద్రత, రాత్రివేళల్లో మెరుగైన వెలుతురు కోసం అవసరమైన ప్రాంతాల్లో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కొమ్మల తొలగింపుపై పరిశీలన దీన్‌దయాల్‌నగర్ రోడ్డులో కొనసాగుతున్న చెట్ల కొమ్మల తొలగింపు, బకెట్ ల్యాడర్ పనులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండటంతోపాటు మానవ వనరులు, పరికరాలను సమర్థంగా వినియోగిస్తున్నారా? అని ఆరా తీశారు. ప్రధాన రహదారులు, రోడ్డు మార్జిన్లలో రాకపోకలకు ఇబ్బంది కలిగించే కొమ్మలను సకాలంలో తొలగించాలని సూచించారు.నిమజ్జన ఏర్పాట్లపై సమీక్షఅనంతరం మల్కాజిగిరి సర్కిల్‌లోని బండచెరువు బేబీ పాండ్‌ను సందర్శించిన కమిషనర్ గణేశ్ నిమజ్జనానికి చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన సమయంలో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు 24 గంటలూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల భద్రత, రాకపోకలు, జనసమ్మర్ద నియంత్రణ, భక్తుల సౌకర్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాలు పూర్తయ్యే వరకు ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ పనులను సకాలంలో పూర్తి చేయాలని, మానవ వనరులను సమర్థంగా వినియోగించాలని కమిషనర్ స్పష్టం చేశారు.ఈ పర్యటనలో డీసీ బాలకృష్ణ ప్రసాద్, ఎస్ఈ లక్ష్మణ్, డీఈ, ఏఈ, టౌన్ ప్లానింగ్, యూబీడీ, రామ్‌కీ, ఈపీటీఆర్ఐ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- **కల్వర్టును ఢీకొన్న కారు.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి**






**శంషాబాద్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** శంషాబాద్‌లో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కారు డ్రైవర్ అశోక్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో మృతి చెందిన వారిని మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం చౌడూరు గ్రామానికి చెందిన జమున, మాన్సింగ్, కేతావత్ లింబ్యా, వాస్రాంగా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొనడానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ అశోక్ పరిస్థితి, ప్రయాణ వివరాలు, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమం ఘనంగా నిర్వహణ

- **ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలి సర్పంచ్ బానోత్ జ్యోతి కొండ**




**బోనకల్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల క్లబ్ మరియు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో "ఏక్ పెడ్ కే నామ్ – తల్లి పేరుతో ఒక మొక్క" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ లింగం నేని నళిని శ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని ఆమె పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని, మొక్కలను పెంచడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో మానవహారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బానోతు కొండ, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి అంతోటి తిరుపతిరావు, అధ్యాపకులు జోనతాన్ బాబు, రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, ప్రియ కుమార్ రెడ్డి, మురళీకృష్ణ, శాంతి ప్రియ, గ్రంథాలయ అధికారి మోహన్, యూడీసీ మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణతో పాటు జాతీయ సేవా పథకం వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ మహాగణపతి అన్నదాన కార్యక్రమం

- **భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు.. మట్టి విగ్రహాల ఏర్పాటుపై పిలుపు**



**బోనకల్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** బోనకల్ మండల కేంద్రంలోని బొడ్రాయి సెంటర్ సమీపంలో యార్లగడ్డ దుర్గాప్రసాద్, విజయ దంపతుల ఇంటి ఎదుట కొలువుదీరిన శ్రీ మహాగణపతి సన్నిధిలో గణపతి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ ముఖ్య అతిథులుగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ బానోతు కొండ మాట్లాడుతూ.. ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా గణనాథుడికి పూజలు చేయడం మన సంప్రదాయమని అన్నారు. ఎంతో మహిమ కలిగిన గణనాథుడిని నవరాత్రుల పాటు భక్తిశ్రద్ధలతో పూజించి, అనంతరం గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేయడం ఆనందకరమైన విషయమని తెలిపారు.ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మట్టితో తయారు చేసిన విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల పంట పొలాలకు, చెరువుల్లో పెంచే చేపలకు ఎలాంటి హాని ఉండదని తెలిపారు. భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు.అన్నదాన కార్యక్రమంలో గుండపనేని సుధాకర్ రావు, తేల్లూరి రమేష్, మోర్ల శ్రీను, చిట్టోజి శ్రీనివాస్, గంగుల పుల్లయ్య, మల్లెల వేలాద్రి, వరుగు నరసింహారావు, షేక్ మీరా సాహెబ్, షేక్ పెద్ద మీరా, మరీదు శివకృష్ణ పాల్గొన్నారు.విగ్రహ దాత మోర్ల ఆంజనేయులు, కమిటీ సభ్యులు యార్లగడ్డ దుర్గాప్రసాద్, యార్లగడ్డ విజయ, మరీదు దుర్గ, మరీదు వెంకటేశ్వర్లు, దొంతు సరస్వతి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ మహాగణపతిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# హయత్ నగర్ శ్రీనివాస హాస్పిటల్ లో అంగరంగ వైభవంగా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు

- **శనివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించిన ఆస్పత్రి యాజమాన్యం**



**హయత్ నగర్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** హయత్ నగర్: హయత్ నగర్ బస్టాండ్ సమీపంలోని శ్రీనివాస హాస్పిటల్ లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. 6వ రోజైన శనివారం ఆస్పత్రి చైర్మన్ డా.ఎన్.రవీంద్ర రావు, సిబ్బంది వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 500 మందికి పైగా పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ డా.ఎన్. రవీంద్ర రావు మాట్లాడుతూ..మానవ సేవే మాధవసేవ అని, అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని అన్నారు.ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆ గణనాథున్ని వేడుకున్నట్లు తెలిపారు.స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నట్లు వారు తెలిపారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులే కాకుండా పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీప, డాక్టర్ సుప్రియ, సునీల్, రామారావు, శివ, గణేష్, నవీన్, శ్రవణ్, గోపాల్, శ్రీనివాస్, కురుమయ్య, కళ్యాణ్, మహిమ, పూజ, పల్లవి, దుర్గ, రేణుక, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు..

# 24 గంటల కరెంటు కోసం కరెంట్ ఆఫీస్ ముందు రైతుల ధర్నా

- ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు ఉద్యమంలో ముగ్గురు అమరులైనారు.
- ఆనాటి ప్రభుత్వంలో టీడీపీకి పట్టిన గతే కాంగ్రెస్ కు పడుతుంది అని హెచ్చరించారు.
- రైతులతో చెలగాటమాడిన ప్రభుత్వం మిగిలిన చరిత్రలో ప్రభుత్వంతో ఉన్న దాఖలాలు లేవు.
- తెలంగాణ రైతు సంఘం యాచారం మండల అధ్యక్ష కార్యదర్శులు మండల బాల్ రాజ్, తావు నాయక్.




**ఇబ్రహీంపట్నం , సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** యాచారం మండల కేంద్రంలో శనివారం తెలంగాణ రైతు సంఘం యాచారం మండల కమిటీ ఆధ్వర్యంలో రైతులకు 24 గంటల కరెంటు సౌకర్యం కల్పించాలని మండల కేంద్రంలో సాగర్ రహదారి పైన ర్యాలీ నిర్వహించి అనంతరం కరెంట్ ఏఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం,ఏఈకి వినతి పత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం యాచారం మండలం అధ్యక్షులు మండల బాలరాజ్ మండల ప్రధాన కార్యదర్శి తావు నాయక్ మాట్లాడుతూ,రైతులకు సకాలంలో వర్షాలు కురవక వేసిన పంటలు పత్తి జొన్న ఒకపక్క పూర్తిగా ఎండిపోవడం వలన రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా వెళ్ళని పరిస్థితి కాబట్టి ఎంతో కొంత రైతులు వరి పంట వేసుకోవడం జరిగింది కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో రైతాంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది అమల్లో మాత్రం లేని పరిస్థితి ఉంది కాబట్టి క్రమ క్రమంగా కరెంటు ఎనిమిది గంటలకు ఇవ్వడం వల్ల ఉన్న కొద్దిపాటి వరి పంట కూడా అదే విధంగా పశువులకి పచ్చ గడ్డి కూడా ఎండి పోతున్నాయి కాబట్టి తక్షణమే ఏఈ జోక్యం చేసుకొని ఈ ప్రాంతాల్లో ఉన్న రైతులకు 24 గంటల కరెంటు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా అర్హులైన ప్రతి రైతుకు కరెంటు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కరువులో ఉన్న రైతులని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతులకి ప్రత్యేకంగా కరెంటు సౌకర్యం ఉండే విధంగా చూడాలని అన్నారు.గ్రామంలో ఏదైనా విద్యుత్ సమస్య ఉంటే ఎల్సీ తీసుకోవడం వల్ల రైతులు కరెంటు పోవడం ద్వారా పంటలకు నీరు సాగు ఇబ్బందికరంగా మారిందని అన్నారు.కాబట్టి రైతులకి ప్రత్యేకమైన లైన్ ద్వారా కరెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.అదేవిధంగా ఈ రెండు నెలల రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంటు సౌకర్యం కల్పించాలని ఏఈ ని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఆలంపల్లి నరసింహ, పి అంజయ్య, అలంపల్లి జంగయ్య,సభావత్ చందు నాయక్ ,రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు,ఎం ఐలయ్య, మండల ఉపాధ్యక్షులు బి శ్రీశైలం,సహాయ కార్యదర్శి ఎస్సార్,ఆంజనేయులు,భాషయ్య,బుగ్గ రాముల,గడ్డం యాదగిరి,రామ్ రెడ్డి,సత్యనారాయణ, కుంటూర గిరికాంత్ , కొండ్ర భాస్కర్ , జంగయ్య ,జగన్, కుమార్ ,మల్లేష్ ,జంగయ్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భగవాన్ యూత్ ఆధ్వర్యంలో గణనాధునికి పూజలు

- వినాయకుడి భక్తుడు యాట బాబయ్య



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** మహేశ్వరం మండల పరిధిలోని మొహబ్బత్ నగర్ గ్రామానికి చెందిన యాట బాబయ్య దంపతులు విగ్నేశ్వరునికి ఘనంగా శనివారం రోజున పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా బాబయ్య మాట్లాడుతూ,ప్రతి ఏటా వినాయక చవితి వేడుకలు జరుపుకుంటామని అదేవిధంగా భక్తి శ్రద్ధలతో ,పాటలు ,భజన కార్యక్రమాలు కోలాటలు నిర్వహిస్తామని అన్నారు.బాగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అదేవిధంగా విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బాబయ్య దంపతులు స్వరూప,వంశీ,రవళి యూత్ సభ్యులు,గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన శోభాయాత్రలో విద్యార్థుల కోలాటం కనువిందు



**కేశంపేట, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** మండల కేంద్రంలో ఆదర్శ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. పాఠశాల అధినేత వెంకటరెడ్డి పర్యవేక్షణలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలు, ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. నిమజ్జన శోభాయాత్రలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి కోలాటం ప్రదర్శించారు. లయబద్ధమైన అడుగులు, ఆటపాటలు, నృత్యాలతో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారి సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.శోభాయాత్ర గణపతి నామస్మరణల మధ్య ఉత్సాహంగా సాగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొనడంతో పరిసర ప్రాంతంలో సందడి నెలకొంది. నిమజ్జనానికి ముందు పాఠశాల ప్రాంగణంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం అలంకరించిన వినాయక విగ్రహంతో శోభాయాత్రను ప్రారంభించారు.ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ,,, విద్యార్థులకు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను పరిచయం చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో ఐక్యత, సాంస్కృతిక భావన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రామడుగు ప్రాజెక్ట్ నుండి సాగునీరు విడుదల చేసిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** ధర్పల్లి మండలంలోని రామడుగు ప్రాజెక్ట్ నుంచి వానకాలం పంటల సాగు కోసం శనివారం నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు భూపతిరెడ్డి నీటిని అధికారికంగా విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఏడాది వాతావరణ ప్రభావంతో సరైన వరదలు లేకపోవడంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, పంటలను కాపాడేందుకు ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయకట్టు ప్రాంతాలకు నీటిని విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ నీటి విడుదల ద్వారా సుమారు 6,000 ఎకరాల ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందుతుందని వెల్లడించారు. రైతులకు ఎలాంటి నీటి ఎద్దడి రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ధర్పల్లి మండల అధ్యక్షులు గాదె నరేష్, సుభాష్, స్థానిక ప్రజా



ప్రతినిధులు, నాయకులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వినాయక యుజన సంఘం ఆధ్వర్యంలో జహంగీర్ కాలనీలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంగారెడ్డి జిల్లా బిజెపి అర్బన్ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి





**చింతలకుంట, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** వినాయక చవితి వేడుకల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్న రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి జహంగీర్ నగర్ కాలనీ లోపల శ్రీధర్ గారి ఆధ్వర్యంలో వినాయక యోజన సంఘం నేతృత్వంలో వినాయక చవితి నవరాత్రి వేడుకలు అత్యంత ఘనంగా, ఆహ్లాదకరమైన పండుగ వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.మొత్తం బస్తీ ప్రజలంతా పిల్లపాపలతో కలిసి పెద్ద సంఖ్యలో విచ్చేసి, అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొనడం విశేషమని ఆయన తెలిపారు. మిగతా రోజుల్లో కూడా ఇదే విధమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భక్తిశ్రద్ధలతో నవరాత్రి వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు.హిందువుల ఐక్యత ఎంత అవసరమో చెప్పడానికి ఈ వేడుకలు ప్రతీకగా నిలుస్తున్నాయని, విఘ్నాలను తొలగించే ఆ వినాయకుడిని భక్తితో కొలవడం ఎంతో ఆనందాన్ని ఇస్తోందని ఆయన అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్న శ్రీధర్ గారిని మరియు వారి బృందాన్ని ఈ సందర్భంగా వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 1800 మంది పైగా భక్తులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో బిజెపి ఎల్బీనగర్ ఇన్చార్జి సామా రంగారెడ్డి, కుంట్లూర్ వెంకటేష్ గౌడ్, వాసు చౌదరి, బిఆర్ఎస్ నాయకులు జిట్టా రాజశేఖర్ రెడ్డి, చింతల రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు యాదాద్రి ట్రస్ట్ బోర్డు దేవాదాయ మెంబర్, పో చబోయిన ఈశ్వరమ్మ యాదవ్, పోచబోయిన సురేష్ యాదవ్, వేములయ్య గౌడ్,తదితరులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ కు బోటిగూడ గ్రామస్థుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు



**శంషాబాద్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** బోటిగూడ గ్రామ అభివృద్ధి పనులపై రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్‌ను గ్రామ సర్పంచ్ కల్లె బిక్షపతి, వార్డు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలోని బీసీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం, మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు, కొత్త బోర్ల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామస్థుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా రామంజపూర్ నుంచి బోటిగూడ వరకు డాంబర్ రోడ్డు నిర్మాణానికి త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని కోరారు. గ్రామంలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంతో పాటు గ్రామ చెరువుకు సంబంధించిన సమస్యను కూడా పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ ప్రజల సమస్యలు, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సానుకూలంగా స్పందిస్తూ, ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత అధికారులతో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు గ్రామస్థుల తరఫున సర్పంచ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు విజయ్ కుమార్ యాదవ్, తెలగామల్ల సత్యనారాయణ, సామ శంకర్, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి.

## -గురుకుల ప్రిన్సిపాల్ వేము రాజు

**ఏన్కూర్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ వేము రాజు కోరారు. స్థానిక గురుకుల విద్యాలయములో శుక్రవారం ఎక్స్ లెన్స్ ఫర్ మిషన్ లైఫ్ లో భాగంగా ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ. ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని అన్నారు. చెట్లు పెంచకుంటే మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని అన్నారు. చిన్ననాటి నుండే సేవా కార్యక్రమాలను, నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ0 కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ శ్రీదేవి, ఏటీపీ సునీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ఎత్తు దూకుడు పోటీల్లో విఐపీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ప్రతిభ




**కేశంపేట, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** కేశంపేట మండలం ఇప్పలపల్లి గ్రామంలోని విఐపీ పబ్లిక్ పాఠశాల విద్యార్థి అక్షయ్ కుమార్ రెడ్డి మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎత్తు దూకుడు పోటీలో పాల్గొని మూడో స్థానాన్ని సాధించాడు. క్రీడల్లో చురుకుగా పాల్గొంటూ సాధన చేస్తున్న విద్యార్థి ఈ పోటీలో మెరుగైన ప్రతిభ కనబరిచి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చాడు. విద్యార్థి సాధించిన విజయంతో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపింది. క్రమశిక్షణతో సాధన చేస్తే క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించి, భవిష్యత్తులో జిల్లా స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

# దోనూర్‌లో ఘనంగా పేరెంట్స్ మీటింగ్జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన లక్ష్మయ్యకు సన్మానం



**మిడ్జిల్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** మిడ్జిల్: మండలంలోని దోనూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో శనివారం పేరెంట్స్ మీటింగ్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాల అభివృద్ధి, తల్లిదండ్రుల భాగస్వామ్యంపై ఈ సందర్భంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన లక్ష్మయ్యను పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల కృషిని అభినందించారు.అనంతరం విద్యార్థులకు షూలను పంపిణీ చేశారు. విద్యార్థుల సంక్షేమానికి ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, క్లస్టర్ హెచ్ఎం వెంకటయ్య, హెచ్ఎం తారాసింగ్, ఉపాధ్యాయులు కృష్ణ, అంజలి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, , వార్డు సభ్యులు సుధాకర్ రెడ్డి, ఆంజనేయులు, జంగయ్య, పరుశురాం, గ్రామ యువకులు మంగనూరి రాము, రవికుమార్, నరేష్ గౌడ్, ఆవుల పాండు, శివలింగం, కమ్మరి రవి, తదితరులు పాల్గొన్నారు.

# కన్యాలాల్ బాగ్ వినాయకుడిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి



**వికారాబాద్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** వికారాబాద్: పట్టణంలోని కన్యాలాల్ బాగ్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మండపానికి చేరుకున్న సందర్భంగా గణేష్ పూజా కమిటీ సభ్యులు, నిర్వాహకులు సాదరంగా స్వాగతం పలికి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం ఉత్సవాల నిర్వహణ, భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, మండపం వద్ద చేపడుతున్న కార్యక్రమాల గురించి కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గణేష్ పూజా కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు, యువకులు పాల్గొన్నారు.

# వనస్థలిపురంలో 'చంద్రశేఖర్ ఆజాద్ క్రాంతి సంఘ్' ఆధ్వర్యంలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

- **ఘనంగా అన్నదాన కార్యక్రమం.. 2 వేల మందికి పైగా భక్తుల రాక**
- **హాజరైన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ జ్యోతి కొండ**




**వనస్థలిపురం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** వనసలిపురం పోస్ట్ ఆఫీస్ సమీపంలో 'చంద్రశేఖర్ ఆజాద్ క్రాంతి సంగ్' ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. కాలనీలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా నిర్వహిస్తున్న ఈ వేడుకలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. సుమారు 2000 మందికి పైగా భక్తులు తరలివచ్చి వినాయకుడిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నేలపాటి రామారావు, జిట్టా రాజశేఖర్ రెడ్డి, సాయి కిరణ్ తదితరులు స్వామివారి దర్శనం చేసుకున్నారు.

**ఐక్యతకు, ఆధ్యాత్మికతకు ప్రతీకగా ఉత్సవాలు: నిర్వాహకులు**

ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు వినోద్ కుమార్, ఇతర సభ్యులు మాట్లాడుతూ.. "గత 31 సంవత్సరాలుగా కాలనీవాసులందరి సహాయ సహకారాలు, ఐక్యమత్యంతోనే ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తూ వస్తున్నాం. గణనాథుని కృపాకటాక్షాలతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని నిత్యం పూజలు చేస్తున్నాం. ప్రతి ఏటా భక్తుల ఆదరణ పెరుగుతుండటం మా బాధ్యతను మరింత పెంచుతోంది. గతేడాది నిర్వహించిన లడ్డూ వేలంపాటకు విశేష స్పందన లభించిందని, భక్తుల పోటీ మధ్య లడ్డూ రూ. 2 లక్షలకు పైగా రికార్డు ధర పలికిందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేశాం. ఈ నెల 25వ తేదీన వినాయక నిమజ్జన శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించనున్నాం. స్థానిక ప్రజలందరూ నిమజ్జనోత్సవం లో పాల్గొని విజయవంతం చేయాలి" అని నిర్వాహకులు వెల్లడించారు. ఈ వేడుకల్లో ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు శశాంక్, ప్రధాన కార్యదర్శి ఆకాష్, కమిటీ సభ్యులు ఓంప్రకాష్, సరోజ్, శ్రీకర్, సందీప్, ఆకాష్, చందు, వివేక్, శ్రీరామ్, సంతోష్‌లతో పాటు కాలనీవాసులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓబీసీల హక్కుల కోసం పార్టీలకతీతంగా ఉద్యమించాలి

- **20న హైదరాబాద్‌లో ఓబీసీ జాతీయ మహాసభ.. 29 రాష్ట్రాల నుంచి ప్రతినిధుల హాజరు**



**శామీర్ పేట, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** దేశవ్యాప్తంగా ఓబీసీల హక్కుల సాధన కోసం పార్టీలకతీతంగా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, బీసీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతా రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ నెల 20న హైదరాబాద్ బేగంపేటలోని హరిత ప్లాజాలో నిర్వహించనున్న ఓబీసీ జాతీయ మహాసభకు దేశంలోని 29 రాష్ట్రాల నుంచి బీసీ ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ మహాసభకు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, వాకిటి శ్రీహరి, వివిధ పార్టీలకు చెందిన బీసీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరుకానున్నట్లు రమేష్‌గౌడ్ తెలిపారు. దేశవ్యాప్తంగా బీసీల సమస్యలు, హక్కులు, భవిష్యత్ కార్యాచరణపై మహాసభలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.జనగణనలో బీసీల లెక్కింపు చేపట్టాలిదేశ జనాభాలో బీసీలు గణనీయమైన సంఖ్యలో ఉన్నప్పటికీ జనగణనలో బీసీలకు ప్రత్యేకంగా వివరాలు నమోదు చేసే అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని రమేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీసీల జనాభాను శాస్త్రీయంగా లెక్కించి, ఆ వివరాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.బీసీల జనాభా గణనపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో, దీనిని జాతీయ స్థాయిలో మరింత బలంగా ముందుకు తీసుకెళ్లేందుకు మహాసభలో కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. బీసీల హక్కుల కోసం దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రతినిధులు కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు.భవిష్యత్ కార్యాచరణపై చర్చబీసీ వర్గాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు జనాభా ఆధారిత హక్కుల సాధనకు ఉద్యమాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీ సంఘాలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఒకే వేదికపైకి రావాలని పిలుపునిచ్చారు.దేశంలోని వివిధ రాష్ట్రాల్లో బీసీ సంఘాలను సమన్వయం చేస్తూ జాతీయ స్థాయిలో ఉద్యమానికి రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో జరిగే మహాసభ కీలకంగా నిలవనుందని పేర్కొన్నారు. బీసీల హక్కుల సాధన కోసం శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ఆయన కోరారు.

# మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని పరిశీలించిన చైర్మన్ పసుపులేటి వీరబాబు.



**పినపాక, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనానికి ఐటీడీఏ నిధుల ద్వారా సుమారు 30 లక్షల రూపాయలతో నూతన భవనానికి త్వరలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ద్వారా తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,పినపాక మండలంలో శనివారం పర్యటనలో భాగంగా గ్రంథాలయ భవనాన్ని గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, సెక్రటరీ కరుణ కుమారి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గోడిశాల రామనాథం తో కలిసి పరిశీలించిన అనంతరం గ్రంథాలయ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అనువైన వాతావరణం కల్పించేలా ఆధునిక సౌకర్యాలతో గ్రంథాలయ భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం గ్రంథాలయ ఆవరణలో స్థానిక సర్పంచ్ అరిగెల అలివేలు, ఉప సర్పంచ్ బోడ తిరుపతయ్య తో కలిసి మొక్కలను నాటడం జరిగింది. నూతన గ్రంథాలయ భవనం అందుబాటులోకి వస్తే పుస్తక పఠనంతో పాటు పోటీ పరీక్షల అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పాఠకుల అవసరాలకు అనుగుణంగా పుస్తకాలు, దినపత్రికలు, మ్యాగజైన్లు, డిజిటల్ వనరులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, పుస్తక ప్రియులు కోరుతున్నారు.నిధులు మంజూరైన వెంటనే భవన నిర్మాణ పనులు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ పర్యటనలో లైబ్రేరియన్ రుక్మిణి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్, ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాలే లక్ష్యంగా ఉచిత శిక్షణ

- బోనకల్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో కార్యక్రమం
- ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారంతో యువతకు శిక్షణ.. పంచాయతీ కార్యాలయంలో 10 కంప్యూటర్లు ఏర్పాటు
- పల్లె ప్రకృతి వనంలో శారీరక శిక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు
- అభ్యర్థులకు క్రమశిక్షణ శారీరిక వ్యాయామం పట్టుదల అవసరం-సర్పంచ్ బానోతు జ్యోతి కొండ




**బోనకల్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పోలీస్, ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో బోనకల్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో యువతకు పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణతో పాటు శారీరక దారుఢ్యానికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.ఈ సందర్భంగా బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువతలో ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన మార్గదర్శకత్వం, శిక్షణ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనేక మంది తమ లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని అన్నారు. అలాంటి యువతకు అండగా నిలవాలనే ఉద్దేశంతో గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు పంచాయతీ కార్యాలయంలో 10 కంప్యూటర్లను ఏర్పాటు చేసి, అభ్యర్థులకు పోటీ పరీక్షల సన్నద్ధతకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు అభ్యర్థులు సులభంగా సిద్ధమయ్యేలా అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.అదేవిధంగా బోనకల్‌లోని పల్లె ప్రకృతి వనాన్ని శిక్షణ కేంద్రంగా వినియోగిస్తూ, పోలీస్, ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాలకు అవసరమైన పరుగు, వ్యాయామం, శారీరక దారుఢ్య శిక్షణను ఉచితంగా అందిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామ యువతకు ఆరోగ్యకరమైన వాతావరణంలో శారీరక శిక్షణ అందించేందుకు ప్రకృతి వనంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

**యువతకు అండగా బోనకల్ గ్రామపంచాయతీ**

నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే కష్టపడి చదవడంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఎంతో అవసరమని బానోతు జ్యోతి కొండ అన్నారు. ముఖ్యంగా పోలీస్, ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాల్లో చేరాలనుకునే యువత విద్యతో పాటు శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు కూడా సమాన అవకాశాలు కల్పిస్తూ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతకు ఉచితంగా శిక్షణ, కంప్యూటర్ సౌకర్యం, శారీరక శిక్షణ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలన్నదే గ్రామపంచాయతీ పాలకవర్గం లక్ష్యమని పేర్కొన్నారు.

**ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారం అభినందనీయం**

బోనకల్ గ్రామ యువత కోసం గ్రామపంచాయతీ చేపడుతున్న కార్యక్రమానికి ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారం అందించడం అభినందనీయమని సర్పంచ్ అన్నారు. గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాల దిశగా మార్గనిర్దేశం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, ఉద్యోగం, దేశ సేవ అనే లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో నిరంతరం శ్రమిస్తే ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడం సాధ్యమేనని అన్నారు. అందుబాటులో ఉన్న ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**ర్యాలీ.. వైద్య పరీక్షలు**

కార్యక్రమంలో భాగంగా అభ్యర్థులతో కలిసి బోనకల్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ రవీందర్‌నాథ్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిక్షణలో పాల్గొనే అభ్యర్థుల శారీరక సామర్థ్యం, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో భవిష్య ప్రాజెక్ట్ మేనేజర్ జీ. శ్రీనివాస్, ఫీల్డ్ కోఆర్డినేటర్లు కె. వెంకటేశ్వరరావు, జి. గోపి, శారీరక శిక్షకులు ఎం.డి. హసద్, ఎం. కృష్ణమోహన్, గ్రామ పెద్దలు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఎస్‌బీఐ ఫౌండేషన్, భవిష్య భారత్ సంస్థ నిర్వాహకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.పోలీస్, ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు 6300691495, 8374844996 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలి : అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ శ్రీనివాస్.



**ఏన్కూరు, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** ఏన్కూరు మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ శ్రీనివాస్ పీఆర్ ఏఈ హైదరాబాద్ ఆయనతోపాటు సీనియర్ అసిస్టెంట్ కార్తీక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ముందుగా తరగతి గదుల్లోకి వెళ్లిన అధికారులు విద్యార్థులతో నేరుగా మాట్లాడి విద్యా బోధన, తరగతుల నిర్వహణ, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా, మౌలిక సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా అనే విషయాలను స్వయంగా తెలుసుకున్నారు. విద్యార్థులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని అధికారులు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణంతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం డార్మిటరీలు, బెడ్లు, ఫ్యాన్లు, విద్యుత్ బల్బులు, డైనింగ్ హాల్, తాగునీరు, పారిశుద్ధ్య వసతులను పరిశీలించారు.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేదా అనే అంశంపై ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థులకు భోజనం, వసతి, విద్యుత్, తాగునీరు తదితర విషయాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాల, కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.ట్రాన్స్‌ఫార్మర్‌పై ప్రత్యేక దృష్టిపాఠశాల, డార్మిటరీలకు మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు ప్రత్యేకంగా పరిశీలించారు. విద్యార్థులు రాకపోకలు సాగించే ప్రాంతానికి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని గుర్తించారు. విద్యార్థుల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యార్థులకు దూరంగా సురక్షితమైన ప్రదేశానికి తరలించే విషయంపై సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకునేందుకు చొరవ చూపుతామని అధికారులు తెలిపారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు, తరగతుల నిర్వహణ, వసతి, భోజన సదుపాయాలు తదితర అంశాలపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో అధికారులు చర్చించారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ వేము రాజుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే ఆరోగ్యకర సమాజం

- భవన్స్ వివేకానంద కళాశాలలో రాష్ట్రీయ పోషణ్ మాహ్–2026



**నేరేడ్ మెట్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** పోషకాహారం, ఆహార భద్రతపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని ఐసీఎంఆర్–ఎన్ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ వద్దేవి వలివండి అన్నారు. భవన్స్ వివేకానంద కళాశాల బయోకెమిస్ట్రీ, న్యూట్రిషన్ విభాగం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సహకారంతో శుక్రవారం రాష్ట్రీయ పోషణ్ మాహ్–2026 నిర్వహించారు. 'హమారీ అంగన్‌వాడీ–హమారీ జిమ్మేదారీ' ఇతివృత్తంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎస్.వి.ఆర్.కె. చౌదరి, ఐసీఎంఆర్–ఎన్ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ వద్దేవి వలివండి, బయోకెమిస్ట్రీ, న్యూట్రిషన్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.పద్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 'ఆహార విషతుల్యత–ఆహార భద్రత' అంశంపై డాక్టర్ వద్దేవి అవగాహన కల్పించారు. కలుషిత ఆహారం వల్ల కలిగే అనర్థాలు, సురక్షితమైన పోషకాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు.ఇతివృత్తంలో భాగంగా విద్యార్థులు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పోషణ్ వాటిక, చిరుధాన్యాలతో బొమ్మల తయారీ, పిల్లల ఎదుగుదల పరిశీలన, కథల పుస్తకాల పంపిణీ, పోషకాహార వంటకాల పంపిణీ వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచేందుకు 14 బృందాలతో స్మార్ట్ ఈటింగ్ ఎక్సర్‌సైజ్ హ్యాకథాన్ నిర్వహించారు. విజేత బృందానికి రూ.1,000 నగదు బహుమతి అందజేశారు. 11 బృందాలతో నిర్వహించిన 'హెల్తీ ఫుడ్ ప్లేట్–న్యూట్రి రంగోలి' కార్యక్రమంలో సమతుల్య ఆహారం ప్రాధాన్యాన్ని విద్యార్థులు సృజనాత్మకంగా ప్రదర్శించారు. అనంతరం ముఖ్య అతిథిని కళాశాల యాజమాన్యం సత్కరించింది.

# ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన ఉపాధ్యాయుడికి ఘన సత్కారం



**ఇల్లందు, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.టేకులపల్లి మండలం కొప్పురాయ గ్రామపంచాయతీ ఒడ్డుగూడెం. జిపిఎస్ స్కూల్ ఉపాధ్యాయుడు.పూనెం నాగేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన శుభ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు పుష్ప గుచ్చాలతో ఉపాధ్యాయుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూనే నాగేశ్వరావు మాట్లాడుతూ పిల్లలు మంచి మార్గంలో నడవాలి వాళ్ళకి మంచి భవిష్యత్తు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ మొక్కటి వెంకట్రావు గ్రామపంచాయతీ సర్పంచ్ చింత కళ్యాణ్. విద్యార్థి తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

# అట్టహాసంగా ప్రారంభమైన జోనల్ స్థాయి క్రీడా పోటీలు.



**పినపాక, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** పినపాక మండలంలోని ఏడూళ్ల బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 70వ పినపాక జోనల్ స్థాయి క్రీడా పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పినపాక, కరకగూడెం మండలాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొంటున్నట్లు పినపాక ఎంఈఓ వీరాస్వామి తెలిపారు. జోనల్ స్థాయి క్రీడా పోటీల సందర్భంగా విద్యార్థుల మార్చ్‌పాస్ట్, క్రీడా జ్యోతి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం వివిధ క్రీడాంశాల్లో పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో కబడ్డీ, కోకో వాలీబాల్, రన్నింగ్ తో పాటు అన్నీ రకాల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తునట్లు పీడి వీరన్న తెలిపారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, జట్టు భావనను అభివృద్ధి చేయడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని వారు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేసే అవకాశం ఉంటుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వాగబోయిన చందర్ రావు, ఉప సర్పంచ్ గంగిరెడ్డి సందీప్ రెడ్డి,పినపాక హెచ్ ఎం రామిరెడ్డి, పిడీలు వీరన్న, అనిల్, వరలక్ష్మి , రాములమ్మ, బాలరాజు, మహేష్, విజయలక్ష్మి , విజయ, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, పాఠశాల పూర్వ విద్యార్థి సత్య నారాయన ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక
ఆదివారం | హైదరాబాద్
20 - 09 - 2026
www.netisubhodaya.com


# నూతన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులకు 'నవశకం'సంస్థ ఆధ్వర్యంలో ఘన సన్మానం!..

- బాధితులకు, పీడిత వర్గాలకు అండగా నిలుస్తూ... సమాజంలో సామాజిక న్యాయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలి...
- మేకల రమేష్ నవశకం ఫౌండర్..




**మధిర, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ కేంద్రంలోని 'నవశకం' కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులకు నవశకం ఫౌండర్ మేకల రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం జరిగింది.బోనకల్లు మండలం నూతన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మాగి ముఖేష్, మధిర మండలం నూతన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వేల్పుల పవన్ కళ్యాణ్ ను పూలమాలలు, శాలువాలతో నవశకం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నవశకం ఫౌండర్ మేకల రమేష్ మాట్లాడుతూ నూతన అధ్యక్షులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు."సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారంలో నూతన నాయకత్వం ముందుండాలి" అని ఆకాంక్షించారు.

# ఓటర్ల సవరణ ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్



**పినపాక, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఓటర్ల జాబితాలో కొత్తగా పేర్ల నమోదు, పేర్ల మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ తీరును తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు.శనివారం పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం గ్రామపంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఓటర్ల వివరాల్లో ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సవరణలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడూళ్ల బయ్యారం పంచాయతీ కార్యదర్శి సంధ్య, బీఎల్ఓ జి.రమాదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం



**ఏన్కూర్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండల కేంద్రంలోని కమ్మవారి కళ్యాణ మండపంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాధాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సంపూర్ణ భగవద్గీత పారాయణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణ పరమాత్మను స్మరిస్తూ భగవద్గీతలోని శ్లోకాలను భక్తి భావంతో పారాయణం చేశారు.భగవద్గీత పారాయణంతో కమ్మవారి కళ్యాణ మండపం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన భగవద్గీత సందేశం మానవ జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని ఆకాంక్షించారు.రాధాష్టమి సందర్భంగా నిర్వహించిన ఈ ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని శ్రీకృష్ణ పరమాత్మను పూజించారు. కార్యక్రమం ప్రశాంతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.

# మాజీ ఎమ్మెల్యే బీరం కుటుంబానికి కేటీఆర్ పరామర్శ

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి మృతికి సంతాపం..
- కుటుంబ సభ్యులను ఓదార్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** కొల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందడంతో, ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. బీరం హర్షవర్ధన్‌రెడ్డి నివాసానికి చేరుకున్న కేటీఆర్.. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా బీరం హర్షవర్ధన్‌రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను కేటీఆర్ ఓదార్చారు. తండ్రిని కోల్పోవడం ఎంతో బాధాకరమైన విషయమని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు తన సానుభూతి, అండగా ఉంటామని తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

**బీరం కుటుంబానికి అండగా కేటీఆర్**

బీరం హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి మృతిచెందిన విషయం తెలుసుకున్న కేటీఆర్ స్వయంగా కుటుంబాన్ని పరామర్శించేందుకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ నాయకుడి కుటుంబంలో చోటుచేసుకున్న విషాద సమయంలో కేటీఆర్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించడం పట్ల బీరం కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కేటీఆర్ వెంట పార్టీకి చెందిన పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీరం హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

**విషాదంలో కుటుంబానికి ఓదార్పు**

తండ్రి మృతితో విషాదంలో ఉన్న బీరం హర్షవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులను కేటీఆర్ ఆప్యాయంగా పరామర్శించారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడి వారి బాధను పంచుకున్నారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.కేటీఆర్ పరామర్శకు వచ్చిన సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కుటుంబానికి తమ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ నియోజక వర్గ టిఆర్ఎస్ పార్టీ తాజా మాజీ ప్రజా ప్రతినిధులు టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాజీ ఎమ్మెల్యే బీరం కుటుంబాన్ని పరామర్శించారు.

# చిన్నంబావిలో కేటీఆర్ పర్యటనకు భారీ స్పందన

- తరలివచ్చిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు
- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాషరావు
- ఉమ్మడి మండలాల ఇన్చార్జి గోవిందు శ్రీధర్ రెడ్డి
- మాజీ జడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణమ్మ, చిన్నారెడ్డి
- మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మధుసూదన్ రెడ్డి




**వనపర్తి, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** చిన్నంబావి మండల కేంద్రం రాజకీయ సందడితో కళకళలాడింది. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) చిన్నంబావి మండల కేంద్రానికి రావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. కేటీఆర్ పర్యటన సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేటీఆర్‌కు ఘన స్వాగతం కేటీఆర్ పర్యటన నేపథ్యంలో చిన్నంబావి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాషరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా ఏర్పాట్లు చేశారు. కేటీఆర్ రాక సందర్భంగా పార్టీ శ్రేణులు ఉత్సాహంగా స్వాగతం పలికారు. ఒకే వేదికపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ముఖ్య నేతలు ఈ కార్యక్రమానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు హాజరుకావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో చిన్నంబావిలో సందడి నెలకొంది. కేటీఆర్ పర్యటన సందర్భంగా పార్టీ శ్రేణుల్లో ఐక్యత, సమన్వయం, భవిష్యత్ కార్యాచరణపై చర్చకు ప్రాధాన్యం లభించింది. స్థానికంగా పార్టీ కార్యకలాపాలను మరింత విస్తృతం చేయడం, నాయకులు కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం వంటి అంశాలపై నాయకులు దృష్టి సారించారు. కార్యకర్తల్లో ఉత్సాహం కేటీఆర్‌ను చూసేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. యువత, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. కేటీఆర్ పర్యటన పార్టీ శ్రేణులకు ఉత్సాహాన్ని ఇచ్చిందని నాయకులు పేర్కొన్నారు. ఇటీవల కూడా ఈ ప్రాంతంలో బీఆర్ఎస్ కార్యకలాపాలు, నాయకుల చేరికలు, పార్టీ కార్యక్రమాలు వార్తల్లో నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల ఇంచార్జ్ గోవిందు శ్రీధర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు గజ్జె ఈదన్న యాదవ్, సీనియర్ నాయకులు కేసిరెడ్డి చిన్నారెడ్డి, సర్పంచ్ లు నరసింహ, మద్దూరి శంకర్, దివ్యశ్రీ రంజిత్ కుమార్, వడ్డేమాన్ రామకృష్ణ, తగరం ఆటో కుర్మయ్య, ఉగ్ర నరసింహ, సంకటి మద్దిలేటి, గూడెపు శివారెడ్డి, గంగేశ్వర్ గౌడ్, గుండా వెంకటస్వామి, మాజీ ఉపసర్పంచ్ గొల్ల బాలపీరు, వివిధ గ్రామాల మండల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దోనూర్‌లో ఘనంగా పేరెంట్స్ మీటింగ్జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన లక్ష్మయ్యకు సన్మానం




**మిడ్జిల్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** మిడ్జిల్: మండలంలోని దోనూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో శనివారం పేరెంట్స్ మీటింగ్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాల అభివృద్ధి, తల్లిదండ్రుల భాగస్వామ్యంపై ఈ సందర్భంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన లక్ష్మయ్యను పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల కృషిని అభినందించారు.అనంతరం విద్యార్థులకు షూలను పంపిణీ చేశారు. విద్యార్థుల సంక్షేమానికి ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని కార్యక్రమంలో పాల్గొన్నవారు పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, క్లస్టర్ హెచ్ఎం వెంకటయ్య, హెచ్ఎం తారాసింగ్, ఉపాధ్యాయులు కృష్ణ, అంజలి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, , వార్డు సభ్యులు సుధాకర్ రెడ్డి, ఆంజనేయులు, జంగయ్య, పరుశురాం, గ్రామ యువకులు మంగనూరి రాము, రవికుమార్, నరేష్ గౌడ్, ఆవుల పాండు, శివలింగం, కమ్మరి రవి, తదితరులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# టైరు పంక్చర్.. అంతలోనే మృత్యుశకటం

- ఆగి ఉన్న సరకు వాహనాన్ని ఢీకొన్న మరో లారీ.. ఇద్దరు కార్మికులు దుర్మరణం
- మరో కార్మికుడికి తీవ్ర గాయాలు.. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ పరార్





**శామీర్‌పేట, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** శామీర్‌పేట రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. టైరు పంక్చర్ కావడంతో రహదారి పక్కన నిలిపి ఉంచిన సరకు వాహనాన్ని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ ఢీకొట్టడంతో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు.పోలీసుల వివరాల ప్రకారం.. చెగుంట నుంచి స్క్రాప్ లోడ్‌తో అశోక్ లేలాండ్ వాహనంలో ఇస్మాయిల్ హుస్సేన్ (26)తో పాటు కార్మికులు ఇబ్రహీం, రింకూ, అశోక్, భీమ్‌షా కీసర వైపు బయలుదేరారు. లియోనియా వంతెన దాటిన అనంతరం సుమారు 300 మీటర్ల దూరంలో వాహనం కుడివైపు వెనుక టైరు పంక్చర్ అయింది.దీంతో వాహనాన్ని రహదారి అత్యవసర మార్గంలో నిలిపారు. రింకూ, ఇబ్రహీం జాకీ రాడ్ సహాయంతో పంక్చర్ అయిన టైరు తొలగించే ప్రయత్నం చేశారు. ఇస్మాయిల్ హుస్సేన్ చేతిలోని దీపం వెలుగులో వాహనం కిందకు వెళ్లి పనిలో నిమగ్నమయ్యాడు. అదే సమయంలో అశోక్, భీమ్‌షా వాహనానికి ఆసరాగా పెట్టేందుకు రాళ్లు తీసుకురావడానికి వెళ్లారు.ఇంతలో వెనుక నుంచి వచ్చిన మరో లారీ అతి వేగంగా వచ్చి ఆగి ఉన్న సరకు వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రింకూ, ఇబ్రహీం, ఇస్మాయిల్ హుస్సేన్‌కు తీవ్ర రక్తగాయాలయ్యాయి. రింకూ, ఇస్మాయిల్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన ఇబ్రహీంను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.సమాచారం అందుకున్న ఇస్మాయిల్ సోదరుడు మహ్మద్ హుస్సేన్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. కళ్లముందే సోదరుడు విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యాడు. కొద్దిసేపటి క్రితం వరకు తనతో కలిసి ప్రయాణించిన సోదరుడు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబసభ్యులు, తోటి కార్మికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ తన పేరు నాగరాజుగా చెప్పినట్లు భీమ్‌షా పోలీసులకు తెలిపాడు. మియాపూర్‌కు చెందిన నాగరాజు ప్రమాదం అనంతరం అక్కడి నుంచి పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారైన లారీ డ్రైవర్ కోసం గాలింపు చేపట్టారు.

# ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం



**ఏన్కూర్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండల కేంద్రంలోని కమ్మవారి కళ్యాణ మండపంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాధాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సంపూర్ణ భగవద్గీత పారాయణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణ పరమాత్మను స్మరిస్తూ భగవద్గీతలోని శ్లోకాలను భక్తి భావంతో పారాయణం చేశారు.భగవద్గీత పారాయణంతో కమ్మవారి కళ్యాణ మండపం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన భగవద్గీత సందేశం మానవ జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని ఆకాంక్షించారు.రాధాష్టమి సందర్భంగా నిర్వహించిన ఈ ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని శ్రీకృష్ణ పరమాత్మను పూజించారు. కార్యక్రమం ప్రశాంతంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.

## జగన్నాథ స్వామి ఆరాధనతో భక్తిమయంగా మారిన రాళ్లగుట్ట




**కేశంపేట్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** కేశంపేట మండలంలోని రాళ్లగుట్టలో జగన్నాథ స్వామి ఆరాధన కార్యక్రమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ స్వామికి 'జగదీశ్వర్ ఆనంద స్వామి'గా నామకరణం చేశారు. అనంతరం శివాలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అలాగే ఆశ్రమ నిర్మాణానికి స్థలం కేటాయించి, త్వరలో నిర్మాణ పనులు చేపట్టాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో గంగాపురం ఆశ్రమ పీఠాధిపతి పరమాత్మానంద స్వామి, యాదగిరిగుట్ట బుచ్చుదాస్ ఆశ్రమ పీఠాధిపతి శంకరానంద స్వామి, ధర్మ ప్రచార సమితి వ్యవస్థాపకులు మహేశ్వర్ సార్, రాష్ట్ర అధ్యక్షులు అయ్యప్పరెడ్డి స్వామి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గురుబోధ రంగదాసు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జూలపల్లి అనసూయ ముదిరాజ్, దోనూరు శివరాములు, సమస్త కార్యదర్శి పల్లకి కృష్ణయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.ఆరు జిల్లాల నుంచి మహిళా కార్యకర్తలు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో గీతా పారాయణం, విష్ణు సహస్రనామాలు, లక్ష్మీ అష్టోత్తరాలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం యజ్ఞ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, భక్తుల నామస్మరణతో రాళ్లగుట్ట ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. ఈ కార్యక్రమం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది. ఈ సందర్భంగా స్వామివారి సేవా కార్యక్రమాల ప్రాధాన్యతను నిర్వాహకులు వివరించారు. ధర్మం, భక్తి, ఆధ్యాత్మిక విలువలను ప్రజల్లో పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. భవిష్యత్తులో రాళ్లగుట్టను ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యక్రమాలను దశలవారీగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు, నిర్వాహకులు కార్యక్రమ ఏర్పాట్లలో భాగస్వాములై విజయవంతం చేశారు. రోజంతా భక్తి గీతాలు, ఆధ్యాత్మిక సందేశాలతో పరిసర ప్రాంతాలు సందడిగా కనిపించాయి. ప్రత్యేకంగా మహిళా కార్యకర్తల హాజరు కార్యక్రమానికి మరింత ఉత్సాహాన్ని తీసుకువచ్చింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆశీస్సులు పొందారు ఎంతో ఆనందంగా.

## గణేష్ నిమజ్జనం నిమిత్తం ఉమ్మెడ బ్రిడ్జిని,ఆర్మూర్ లోని గుండ్ల చెరువు,బాసర బ్రిడ్జి,నిజామాబాదు నగరంలోని నిమజ్జనం రూట్ ను పర్యవేక్షించిన పోలీస్ కమీషనర్,జిల్లా కలెక్టర్

- గణేష్ నిమజ్జనం సందర్భంగా సంబంధిత రెవిన్యూ సిబ్బంది కి,పోలీస్ సిబ్బందికి సహకరించగలరు



**నిజామాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** శనివారం నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య,జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా లు నందిపేట్ మండలం ఉమ్మెడ బ్రిడ్జ్ వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ నిమజ్జన స్థలాన్ని,ఆర్మూర్ లోని గుండ్ల చెరువు,బాసర బ్రిడ్జి,నిజామాబాద్ నగరంలోని గణేష్ నిమజ్జనం రూట్ సందర్శించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులు అక్కడి భద్రతా ఏర్పాట్లు,ట్రాఫిక్ నియంత్రణ,ప్రజల రాకపోకలు,నిమజ్జన కోసం ఏర్పాటు చేసిన క్రేన్లు,లైటింగ్,వైద్య సదుపాయాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పలు సూచనలు తెలియజేయడం జరిగింది,నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా,ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.డీజే లను అనుమతించకూడదని తెలిపినారు.ప్రజలు కూడా పోలీసు విభాగానికి సహకరించి,గణేశ్ నిమజ్జనాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్,జిల్లా జాయింట్ కలెక్టర్ భుజంగారావు, అదనపు కలెక్టర్లు, ఏసీపీలు, ఆర్డీవోలు, తహసీల్దారులు, సిఐలు,ఎస్ఐలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్



**మంథని, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు చేపడుతున్న ఏర్పాట్లను మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. కమిషనర్ ఎన్. మనోహర్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, పోలీసు అధికారులతో కలిసి గోదావరి నది వద్ద నిమజ్జన స్థలం, మార్గాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జన మార్గంలో పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.మున్సిపల్, పోలీసు శాఖల సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. భక్తులు, గణేష్ ఉత్సవ కమిటీలు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ బుద్దె స్వామి, ఎస్ఐ ఎన్. సందీప్, నాయకులు ఎరుకల రమేష్, లైశెట్టి రాజు, దేవాలయాల చైర్మన్లు గుండా రాజు, వంగల తిరుమలేష్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంతారం గ్రామంలో బాలుడు మృతి



**షాబాద్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన విషాద ఘటన షాబాద్ మండలం అంతారం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంతారంగ్రామానికి చెందిన జిట్టా చంద్రశేఖర్ (16), తండ్రి లక్ష్మయ్య. వృత్తిరీత్యా గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలుడు గ్రామ శివారులోని పంట పొలాల్లో చెట్టుకు ఉరివేసుకునీ అక్కడికక్కడే మృతి చెందాడు విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

## ఖమ్మం గురుకుల డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ వేడుకలు





**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఖమ్మం నందు కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థినులను, సీనియర్ విద్యార్థినులు ఆత్మీయ స్వాగతంతో ఆహ్వానిస్తూ ఫ్రెషర్స్ పార్టీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సునీత అధ్యక్షత వహించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమంను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన విద్యార్థినులు కళాశాల వాతావరణానికి అలవాటు పడుతూ, విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, సమయపాలన పాటిస్తూ ఉన్నత లక్ష్యాల దిశగా ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులలో స్నేహభావం, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతను పెంపొందించడమే ఫ్రెషర్స్ పార్టీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం నూతన విద్యార్థినులకు మిస్ ఫ్రెషర్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు, వినోదాత్మక కార్యక్రమాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థినులలో పరస్పర పరిచయం, స్నేహభావం, సహకార స్ఫూర్తిని పెంపొందిస్తూ ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సునీత , అధ్యాపక, అధ్యాపకేతర బృందం, సీనియర్ విద్యార్థినులు, నూతన విద్యార్థినులు పాల్గొన్నారు.

## లోకకల్యాణమే లక్ష్యంగా పాదయాత్ర సాగాలి

- పర్యావరణ హితమే సమాజానికి రక్ష
- రోజూ మొక్కలు నాటడం అభినందనీయం
- శాంతి, ఐక్యతలతోనే సమాజ ప్రగతి
- ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యత
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా



**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** లోకకల్యాణం, మానవాళి శాంతి, ఐక్యతలే లక్ష్యంగా సాగుతున్న పాదయాత్ర విజయవంతం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా ఆకాంక్షించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం నుంచి తిరుపతి వెంకటేశ్వరస్వామి క్షేత్రం వరకు సుమారు 600 కిలోమీటర్ల మేర చేపట్టిన 'భద్రాద్రి రాముడు టు గోవిందుడు' పాదయాత్ర బృందానికి భద్రాద్రి జిల్లా సరిహద్దులో మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ఆయన ఘనంగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ సర్వజనుల సంక్షేమం, మానవ సమాజంలో శాంతి నెలకొనాలనే సంకల్పంతో ఈ యాత్ర చేపట్టడం హర్షణీయమన్నారు. ముఖ్యంగా ఆధ్యాత్మిక సాధనతో పాటు సమాజ హితం కోసం ప్రతిరోజూ ఒక చెట్టు నాటుతూ, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవడం గొప్ప పర్యావరణ స్పృహకు నిదర్శనమని కొనియాడారు. భక్తిభావానికి సామాజిక స్పృహను జోడించి చేపట్టిన ఈ మహత్తర కార్యం ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్ర చౌదరి, వై. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మురళీ, సనత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల విజ్ఞాన యాత్ర





**మంథని, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :**
మంథని మండలం ఆరెంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వహించిన ఒకరోజు క్షేత్ర పర్యటన విజ్ఞానదాయకంగా సాగింది. ముత్తారం మండలం లోని సందరెల్లి కాకతీయుల కాలం నాటి దేవాలయాలు, తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ ప్రాంతాలను విద్యార్థులు సందర్శించి చారిత్రక, శాస్త్రీయ, పారిశ్రామిక అంశాలపై ప్రత్యక్ష అవగాహన పొందారు. క్షేత్ర పర్యటనలో భాగంగా సందరెల్లి ప్రాంతంలోని కాకతీయుల కాలం నాటి రెండు దేవాలయాలను విద్యార్థులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కాకతీయుల కాలం నాటి చారిత్రక వారసత్వం, ఆనాటి జీవన విధానం, నిర్మాణ శైలి, దేవాలయాల ప్రత్యేకతలను వివరించారు. ఆలయాల కుడ్యాలపై కనిపించే శిల్పకళా నైపుణ్యం, విగ్రహాల తయారీ విధానం, మానేరు నది ఒడ్డున భారీ దేవాలయాల నిర్మాణానికి దారితీసిన ఆనాటి చారిత్రక, రాజకీయ పరిస్థితులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సందరెల్లి పరిసర ప్రాంతాల్లోని చాళుక్యుల కాలం నాటి నాగశిలలు, కాకతీయుల అనంతర కాలానికి చెందిన రాతి విగ్రహాలను కూడా విద్యార్థులు పరిశీలించారు. వాటి చారిత్రక ప్రాధాన్యతను ఉపాధ్యాయులు వివరించారు. పుస్తకాల్లో చదివిన చారిత్రక అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం లభించడంతో విద్యార్థుల్లో చరిత్రపై ఆసక్తి మరింత పెరిగింది.అనంతరం తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ ప్రాంతాన్ని విద్యార్థులు సందర్శించారు. బొగ్గు దేశీయ పారిశ్రామిక ప్రగతికి అందిస్తున్న సేవలు, బొగ్గు వెలికితీతలో అనుసరించే వివిధ పద్ధతులు, ఓపెన్ కాస్ట్ విధానం, దాని వెనుక ఉన్న సాంకేతిక అంశాలను విద్యార్థులకు వివరించారు. బొగ్గు వెలికితీత ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా పారిశ్రామిక రంగంపై విద్యార్థులకు అవగాహన ఏర్పడింది. క్షేత్ర పర్యటనల ద్వారా విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ప్రత్యక్ష అనుభవం లభిస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈదులపల్లి నరసింహారావు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశీలనా శక్తిని పెంపొందించడంతో పాటు చారిత్రక, శాస్త్రీయ, పారిశ్రామిక అంశాలపై అవగాహన పెంచుతాయని పేర్కొన్నారు. నేర్చుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా విద్యార్థులు వాటిని మరింత సులభంగా అర్థం చేసుకోగలుగుతారని తెలిపారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులతో కలిసి క్షేత్ర పర్యటన నిర్వహించినట్లు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు ఈదులపల్లి నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటనలో పాఠశాల ఉపాధ్యాయులు సువార్త, పద్మజ, మమత, గియాజుద్దీన్, శ్రీలత, శ్రీవాణి, సహేందర్, రాజు, అమన్ పాల్గొన్నారు.

## ఐ.డీ.ఓ.సీలో వినాయకునికి ప్రత్యేక పూజలు పాల్గొన్న కలెక్టర్,సీపీ





**నిజామాబాద్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :**
వినాయక చవితి వేడుకల్లో భాగంగా నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ప్రాంగణం(కలెక్టరేట్)లో ప్రతిష్టించిన వినాయకుడికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.కలెక్టర్ భవేష్ మిశ్రా,పోలీస్ కమిషనర్ సాయి చైతన్య,అదనపు కలెక్టర్ వి.భుజంగరావు గణనాథుడిని దర్శించుకుని అన్న ప్రసాద వితరణలో పాల్గొన్నారు.ట్రేసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి అన్న ప్రసాద వితరణ గావించగా,డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి,సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్ సహకారం అందించారు.ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ,అదనపు డీసీపీ శుభం నగ్రాలే,ట్రైనీ కలెక్టర్ సురేష్,డీఆర్ఓ గీత,ఆర్డీఓ రాజేంద్ర కుమార్,కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు,సూపరింటెండెంట్ శ్రీనివాస్,ప్రశాంత్,భాస్కర్,అన్ని శాఖల అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

## పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి పరిస్థితి విషమం






**పినపాక, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం వలస ఆదివాసీ గ్రామమైన అశ్వాపురంపాడులో వజ్జా బీమరాజు అనే వ్యక్తిపై దాడి జరిగిన ఘటన కలకలం రేపింది. పాత కక్షల నేపథ్యంలోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే తీవ్ర గాయాలతో కొన ఊపిరితో ఉన్న బీమరాజును 108 అంబులెన్స్ ద్వారా మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితిపై వైద్యులు చికిత్స అందించినట్లు సమాచారం. బీమరాజుకు భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్దపై దాడి జరగడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనకు పాతకక్షలే కారణమని గ్రామస్తులు పేర్కొంటున్నప్పటికీ, అసలు కారణాలు, దాడికి పాల్పడిన వ్యక్తులు ఎవరన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఘటనపై ఎస్ఐ పివి నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

నేటి శుభోదయ
ప్రజా క్షేమం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక
ఆదివారం | హైదరాబాద్
20 - 09 - 2026
www.netisubhodaya.com


# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన భారత రాష్ట్ర సమితి నాయకులు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :**
అత్తాపూర్, రాజేంద్రనగర్ వలయాల బాధ్యులు కోలన్ సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి నాయకులు వినాయక నిమజ్జనం జరిగే పల్లె చెరువు, పత్తి కుంట చెరువులను పరిశీలించారు. అన్ని విభాగాల నాయకులతో కలిసి ప్రభుత్వం నిమజ్జనం కోసం చేసిన ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. పల్లె చెరువులో నిమజ్జనం కోసం ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయలేదని సుభాష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చెరువులోని గుర్రపు డెక్కను ముందే తొలగించి, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి, భారీ యంత్రాల సంఖ్య పెంచి, గజ ఈతగాళ్లు, పోలీసు సిబ్బందిని ఉంచి, భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పించి, విగ్రహాలు సులభంగా మునిగేలా నీటి కొలనులను చక్కగా ఏర్పాటు చేసేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం పల్లె చెరువులో పది విగ్రహాలు కూడా మునగలేని చిన్న కొలనును ఏర్పాటు చేశారని, దీనివల్ల ఈసారి ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని అన్నారు. పల్లె చెరువు, పత్తి కుంటలలో యంత్రాల సంఖ్య పెంచి, తాగునీటి సౌకర్యం, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచి, ఎండ, వానల నుండి భక్తులకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాటేదాన్ విభాగ అధ్యక్షులు ఎస్ వెంకటేష్, మాజీ మండలి సభ్యులు రమేష్ ముదిరాజ్, మైలార్ దేవ్ పల్లి విభాగ అధ్యక్షులు గుమ్మడి కుమార్, హైదర్ గూడ అధ్యక్షులు నరేందర్



ముదిరాజ్, రాము యాదవ్, మైసిరెడ్డి, రఘు యాదవ్, రాజేష్ యాదవ్, ఎడ్లకాడి సూర్యం, జగదీష్, రామస్వామి, జంపుల భగవాన్ దాస్, చిరంజీవి, ఉమారెడ్డి, తిరుపతి రెడ్డి, పచ్చ శ్రీనివాస్, కృష్ణ ముదిరాజ్, క్రాంతి, సింహాచలం, రిషి తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :**
రాజేంద్రనగర్ మండల కార్యాలయం వద్ద బస్తీ వాసులు ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద ఈరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ మీసాల బ్రదర్స్ జె విజయ్ ఆనంద్ గౌడ్, జె సదానంద్ గౌడ్, జె ఆనంద్ గౌడ్ లు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కన్యగారి నరసింహారెడ్డి, సీపీఐ మండల కార్యాలయ కార్యదర్శి జి సత్యం, సీపీఐ కాటేదాన్ శాఖ కార్యదర్శి శ్రీరాములు, రాత్లావత్ బిక్షపతి నాయక్, కె మధు, శీను, యువకులు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గణేష్ మండపం యువకులు అన్నదానం చేసిన వారిని,



సీపీఐ మండల కార్యదర్శిని శాలువాతో సత్కరించారు.

# బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో కేబుల్ టీవీ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సదస్సు విజయవంతం

- కేబుల్ టీవీ రంగ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తాం
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- ఆంధ్రా పత్రికలు, ఛానళ్లపై ఉన్న ప్రేమ కేబుల్ టీవీ జర్నలిస్టులపై ఎందుకు లేదు?సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి
- అర్హులందరికీ అక్రిడేషన్ కార్డులు అందేలా కృషి చేస్తా కమిటీ మెంబర్ విరత్ అలీ భరోసా
- ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే భారీ మూల్యం తప్పదు ఆనం చిన్నన్న హెచ్చరిక






**హైదరాబాద్ , సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :**
తెలంగాణలోని కేబుల్ టీవీ రంగానికి, అందులో పనిచేస్తున్న జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించడానికి కేబుల్ టీవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బి నరసింహ చారి , పొదీల వెంకట్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సు విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యాజమాన్యాలు, సిబ్బంది ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఈ సదస్సులో నాయకులు, ప్రముఖ జర్నలిస్టులు మాట్లాడుతూ,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గారు:ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గారు మాట్లాడుతూ. కేబుల్ టీవీ యాజమాన్యాలు, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి,వాటిని రాష్ట్ర ప్రభుత్వం,ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి దృష్టికి అలాగే సంబంధిత మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.గత ప్రభుత్వంలో జిల్లాకు నాలుగు అక్రిడేషన్ కార్డులు ఇస్తే, ఈ ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదనే అంశంపై పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి, అవసరమైతే చట్టసభల్లో అసెంబ్లీలో కూడా దీనిపై మాట్లాడతానని ఆయన స్పష్టం చేశారు.సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి అనంతరం సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ.ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆంధ్రా దినపత్రికలు, ఛానళ్లపై చూపిస్తున్న ప్రేమ, తెలంగాణలో క్షేత్ర స్థాయిలో రాత్రింబవళ్లు కష్టపడుతున్న అర్హులైన కేబుల్ టీవీ జర్నలిస్టులపై ఎందుకు లేదని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.ఈ ప్రభుత్వం కేబుల్ టీవీ రంగాన్ని తీవ్రంగా చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలని, ప్రతి జిల్లాకు 4 కార్డులు రాష్ట్ర స్థాయిలో 12 కార్డులు ఇచ్చే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేయక తప్పదని హెచ్చరించారు. "ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉంది. ఆ సెల్‌ఫోన్ అనే ఆయుధం మా చేతిలో కూడా ఉంది. కష్టపడి సాధించుకున్న తెలంగాణలో మీరు చేస్తున్న దోపిడీని, ఆంధ్రా పత్రికలు, ఛానళ్లకు మీరుకొమ్ముకాస్తున్న తీరును ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూనే ఉంటాం" అని యాదగిరి స్పష్టం చేశారు. అధికారులు కూడా వెంటనే స్పందించి కేబుల్ టీవీ యాజమాన్యాలు పెట్టిన డిమాండ్లను పరిష్కరించే దిశగా పనిచేయాలని డిమాండ్ చేశారు.స్టేట్ అక్రిడేషన్ కమిటీ మెంబర్ విరత్ అలీ ,అక్రిడేషన్ కమిటీ మెంబర్ విరత్ ఆలీ మాట్లాడుతూ.కేబుల్ టీవీ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు దక్కేలా నా వంతుగా ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయిలో కష్టపడుతున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డు అందేలా తన వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు.ఆనం చిన్నన్న ముఖ్య వక్త ఆనం చిన్నన్న మాట్లాడుతూ.కేబుల్ టీవీ రంగంపై ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న కేబుల్ టీవీ అంటే ఈ ప్రభుత్వానికి ఎందుకు ఇంత చిన్నచూపు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన కేబుల్ టీవీ ప్రతినిధులు:ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కేబుల్ టీవీ ఛానళ్ల యాజమాన్యాలు, సీఈఓలు, వివిధ జిల్లాల నుండి వచ్చిన జర్నలిస్టులు, సాంకేతిక సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.తమకు జరుగుతున్న అన్యాయాలపై అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని తీర్మానించారు.కేబుల్ టీవీలను వెంటనే ప్రభుత్వ ప్రకటనల కోసం ఎంప్యానల్ చేయాలని, జిల్లా కమిటీల్లో కేబుల్ టీవీ ప్రతినిధులకు చోటు కల్పించాలని సదస్సు ద్వారా ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కేబుల్ టీవీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# చింతకాని ప్రభుత్వ ఆసుపత్రి కి సిరెంజెస్ డొనేట్ చేసిన ఆవుల నాగేశ్వర్రావు.

- పెద ప్రజల ఆరోగ్యం పై స్పందించిన వందనం సర్పంచ్.



**చింతకాని, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** చింతకాని మండల కేంద్రంలోని ప్రాథమిక ప్రభుత్వ ఆసుపత్రి కి వందనం గ్రామ సర్పంచ్ ఆవుల నాగేశ్వరావు శనివారం నాడు సైరెంజెస్ దానం చేసి మాట్లాడుతూ పెద ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని కోరారు అలాగే గ్రామాలలో ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని అన్నారు,పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.డాక్టర్ అల్తాఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి కి సైరెంజెస్ డొనేట్ చేయడం మంచి ఆలోచన అని తెలిపారు ఇలాంటి సేవలు ప్రజలకు మరెన్నో చేయాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో చింతకాని గ్రామ సర్పంచ్ కిలారు మనోహర్ బాబు,కాంగ్రెస్ పార్టీ వందన గ్రామ శాఖ అధ్యక్షులు కామసాని శంకర్ రావు,ఉప అధ్యక్షులు పొన్నం శంకర్ రావు,ఉపాధ్యక్షులు షేక్ మోయిన్,టీడీపీ నాయకులు బండి ప్రసాద్,గడ్డం రాఘువులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శివరాంపల్లి అంగన్వాడీ కేంద్రం లో పోషకాల వారోత్సవాలు



**రాజేంద్ర నగర్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** సూపర్వైజర్ పద్మజ,కోమల్, లు ముఖ్యఅతిధిలుగా వచ్చి తల్లులకు పిల్లలకు పోషకాల ప్రాముఖ్యతను వివరించారు, ఈ కారిక్రమములో టీచర్ జయశ్రీ ,రత్నా, సంగీత, సుమిత్ర, కల్పన, సహాయకురాలు సుశీల మరియు గర్భిణుల బాలింతలు పిల్లలు పాల్గొనడం జరిగింది.

# రాజేంద్రనగర్ మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం




**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** 70వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో ఎంపిక పోటీలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శివరాంపల్లిలో ప్రారంభించారు. ఈ పోటీల్లో 125 జట్లు, 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూక్య శీను నాయక్ పూజా కార్యక్రమం నిర్వహించి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విభాగ బాధ్యులు కే గాంగ్య నాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు బాలస్వామి రెడ్డి, రంగారెడ్డి, జ్యోతి, ఉపాధ్యాయ సంఘ నాయకులు సుదర్శన్, జనార్ధన్ చారి, వెంకటయ్య, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు ప్రకాష్, వెంకట్, తరుణ్, మహేందర్, మహేష్ పాల్గొన్నారు. వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మండల బాధ్యులు బహుమతులు అందజేశారు. వర్షం కారణంగా మిగిలిన జట్లకు పోటీలు సోమవారం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలియజేశారు.

# భక్తి పేరుతో ఇబ్బందులా

- పెద్దమ్మతల్లి ఆలయంలో సౌకర్యాల కొరత
- టోకెన్ కోసం ఒకచోట, మొక్కు తీర్చుకునేందుకు రోడ్డు దాటాల్సిందే
- తలనీలాల నుంచి పారిశుధ్యం వరకు భక్తుల అవస్థలు



**ఖమ్మం, పాల్వంచ, సెప్టెంబర్ 17, నేటి శుభోదయ :** భక్తుల కొంగుబంగారంగా పేరొందిన పాల్వంచ పెద్దమ్మతల్లి ఆలయానికి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ముఖ్యంగా తలనీలాలు సమర్పించుకునేందుకు, వివిధ మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భారీగా హాజరవుతుంటారు. అయితే భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ పరిసరాల్లో సౌకర్యాలు మాత్రం కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.తలనీలాలు సమర్పించుకునే భక్తులు ముందుగా ఒకచోట టోకెన్ తీసుకుని, అనంతరం మొక్కు చెల్లించుకునే ప్రాంతానికి వెళ్లేందుకు రద్దీగా ఉండే ప్రధాన రహదారిని దాటాల్సి వస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రాకపోకలు అధికంగా ఉండే సమయంలో రోడ్డు దాటడం వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ప్రమాదకరంగా మారుతోందని చెబుతున్నారు. భక్తుల భద్రత దృష్ట్యా ప్రత్యేక మార్గం లేదా తగిన రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

**తలనీలాలకు అదనపు వసూళ్ల ఆరోపణలు**




తలనీలాలు సమర్పించే భక్తుల నుంచి టోకెన్ రుసుము చెల్లించినప్పటికీ, నాయీ బ్రాహ్మణులకు అదనంగా రూ.100 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. టోకెన్ ద్వారా ఇప్పటికే రుసుము చెల్లించిన భక్తుల నుంచి మళ్లీ డబ్బులు అడగడంపై కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఆలయ అధికారులు స్పష్టత ఇవ్వాలని భక్తులు కోరుతున్నారు.

**మహిళా భక్తులకు మరుగుదొడ్ల కష్టాలు**

ఆలయానికి వచ్చే మహిళా భక్తులకు మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. భక్తుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు, వాటి పరిశుభ్రత, నీటి వసతి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని మహిళా భక్తులు అంటున్నారు.

**ఎక్కడ చూసినా చెత్త, పారిశుధ్యం ఎక్కడ?**

ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త బుట్టలు, నిరంతర పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో వ్యర్థాలు ఎక్కడికక్కడ పడివుండటం కనిపిస్తోందని వారు చెబుతున్నారు.భక్తుల రద్దీకి అనుగుణంగా పారిశుధ్య సిబ్బందిని పెంచి, ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేయాలని కోరుతున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని ఆలయ



అధికారులు సూచిస్తున్నారు.

**ఆదాయం వస్తోంది, అభివృద్ధి ఎక్కడ?**

ఆలయానికి భక్తుల రాకతో వివిధ రూపాల్లో ఆదాయం సమకూరుతున్నప్పటికీ, ఆ ఆదాయానికి అనుగుణంగా భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భక్తుల భద్రత, మరుగుదొడ్లు, తాగునీరు, పారిశుధ్యం, తలనీలాల నిర్వహణ, రహదారి దాటే ప్రాంతాల్లో భద్రతా చర్యలు వంటి అంశాలపై ఆలయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.భక్తులకు ఇబ్బందులు లేకుండా తక్షణమే సౌకర్యాలు మెరుగుపరచి, ఆలయానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



## కోదాడ మెగా జాబ్‌మేళాలో సత్తా చాటిన యస్.బి.ఐ.టి. విద్యార్థులు



**ఖమ్మం , సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కోదాడలో నిర్వహించిన మెగా జాబ్‌మేళ 2026లో భాగంగా తమ కళాశాలకు చెందిన విద్యార్థులు 73 ఉద్యోగాలను సాధించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ఉద్యోగ మేళలో 340 పైచిలుకు కంపెనీలు పాల్గొనగా ఖమ్మం జిల్లా నుండి తమ విద్యార్థులు వివిధ హోదాలలో ఉద్యోగాలు సాధించి జిల్లా ప్రతిష్టను పెంచారని కృష్ణ అభిప్రాయపడ్డారు. గూగుల్, విప్రో, ఫాక్స్‌ఖాన్, ఐసిఐసిఐ బ్యాంక్, కోటక్ మహేంద్రబ్యాంక్‌లతో పాటు ఐటి, ఫార్మా, కన్స్ట్రక్షన్ వంటి వివిధ రంగాలకు చెందిన వందలాది కంపెనీలు ఉద్యోగ మేళాలో పాల్గొనగా తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం కేవలం తమ కళాశాలకే కాకుండా ఖమ్మం జిల్లాకు గర్వకారణంగా నిలిచారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి తెలిపారు. తెలంగాణా రాష్ట్రప్రభుత్వంతో పాటు తెలంగాణా రైజింగ్, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణా (డి.ఈ.ఈ.టి), టాస్క్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (యస్.సి.సి.యల్) సంయుక్తంగా నిర్వహించిన మెగా జాబ్‌మేళా 2026 కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద రావు, ఇరిగేషన్ శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎం.ఎల్.ఏ. పద్మావతి రెడ్డి పాల్గొని ఎంపికైన విద్యార్థులకు స్వయంగా నియామక పత్రాలను అందించినట్లు కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. మెగా జాబ్‌మేళా 2026కు తమ కళాశాలకు చెందిన చివరి సంవత్సరం సి.యస్.ఈ., ఈ.సి.ఈ, ఈ.ఈ.ఈ. విద్యార్థులు పాల్గొనగా తమ కళాశాలలో అందించిన నిరంతర ట్రైనింగ్స్ ఉపయోగపడినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రాజ్‌కుమార్ తెలిపారు. కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ వంటి వివిధ ఆధునిక, సాంకేతిక శిక్షణ ద్వారా ఈ ఘనత సాధించినట్లు, ఇటువంటి శిక్షణలు రానున్న రోజులలో మరింతగా అందించి బహుళజాతి సంస్థలకు ఎంపికయ్యేలా చూస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు అందజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, టి.పి.ఒ. డాక్టర్ యన్. సవిత, డాక్టర్ జి. ప్రభాకర్, కె. ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం శ్రీ వరసిద్ధి వినాయక కళ్యాణ మహోత్సవం

- ఉత్సవ మూర్తులకు ఘనంగా కళ్యాణం
- కోలాహలంగా ఊరేగింపు





**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :**
ఖమ్మం నగరం బైపాస్ రోడ్డ గల తారకరామా ఆటో నగర్లో ఫోర్ వీలర్స్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రుల్లో భాగంగా వరసిద్ధి వినాయక కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం అనంతరం పుణ్యాహవచనం, పంచగవ్య , కళ్యాణ మహోత్సవం, కనులు పండుగ నిర్వహించడం జరిగింది. అనంతరం వేద ఆశీర్వనంతరం తీర్ధ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు మహంకాళి మల్లికార్జునరావు, కేశగాని రవి, కనకం రామకృష్ణ, భానోత్ రాందాస్ నాయక్, గుజ్జుల వెంకట్ రెడ్డి, మట్టా భీమయ్య, కొనకటి శామందర్ రెడ్డి, గంగవరపు శ్రీనివాసరావు, పబ్బు భాస్కర్, మహంకాళి మహేష్, ఫోర్ వీలర్స్ టెక్నీషియన్ సభ్యులు , గణపతి మాలధారించిన స్వాములు పెద్ద ఎత్తున మహిళలు భక్తులు పాల్గొన్నారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక
ఆదివారం | హైదరాబాద్
20 - 09 - 2026
www.netisubhodaya.com



## పలు మండపాల్లో అన్న దానం ను ప్రారంభించిన ఆర్జేసీ కృష్ణ





**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని 46వ డివిజన్ శ్రీ గణేష్ సాయిరాం యూత్ కమిటీ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి ఉత్సవాల మండపం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాన్ని బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ ప్రారంభించారు. దీనితో పాటు నగరంలో నీ పలు మండపాల్లో ఏర్పాటు చేసిన అన్నదానం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనాధుడు ఆశీర్వాదంతో ప్రజలందరూ సుఖ శాంతులతో వర్ధిల్లాలి అని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు కృష్ణ ను సత్కరించారు.ఈ కార్యక్రమం లో కర్నాటి వీరభద్రం,బిఆర్ ఎస్ నాయకులు కనకం భద్రయ్య,ముక్కాల రాజేష్ ,బండి నవీన్,మధు,స్థానిక పెద్దలు తొగరు భాస్కర్,కమిటీ సభ్యులు పగిళ్ళ బుచ్చి బాబు,గోనెల లక్ష్మణ్,రవి శ ంక ర్, వికాస్, న వీన్, బన్ను,విగ్గు,జస్వంత్,అభి,రాము,నరేష్,శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కామంచికల్ సర్పంచ్ బొప్పి ప్రభాకర్ రావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య





**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** రఘునాథపాలెం మండలం కామంచికల్ గ్రామ సర్పంచ్ బొప్పి ప్రభాకర్ రావు తండ్రి బొప్పి సైదులు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య వారి నివాసానికి చేరుకుని సైదులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం సర్పంచ్ బొప్పి ప్రభాకర్ రావుని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, మండల నాయకులు మేదరమెట్ల శ్రీనివాసరావు, గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జంగాల ఉపేందర్, సొసైటీ డైరెక్టర్ మేదరమెట్ల శ్రీనివాసరావు, వడ్డేబోయిన లింగయ్య, లింగనబోయిన బాబు, ప్రతాపునేని రవి, బోయినపల్లి రాంబాబు, జంగాల ఉపేందర్, సూదగాని ఉపేందర్, పిండిగ శ్రీకృష్ణలతో పాటు పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సెంట్రల్ వర్సిటీ ఏర్పాటు చేయాలి

- **ప్రధాని మోదీకి లేఖ రాసినమాజీ ఎంపీ గొట్టె భూపతి**



**కరీంనగర్, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** మంచాల మండలం విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆరుట్ల గ్రామంలోని విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు ఇంద్రోజ్ నరేష్ చారి ఉపాధ్యక్షుడు ఇంద్రోజ్ పురుషోత్తంచారి కార్యదర్శి కొల్లోజ్ శంకర చారి ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.యజ్ఞం పూజా కార్యక్రమం ఏర్పాటు చేశారు.యజ్ఞం పూజలో విశ్వకర్మ సంఘానికి చెందిన సభ్యులు దంపతులతో యజ్ఞంలో కూర్చొని ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు బాగా కృషి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆదేవుని వేడుకున్నారు ఈకార్యక్రమంలో పెద్దఎత్తున విశ్వకర్మ సంఘం కుటుంబాలకు చెందిన మహిళలు పెద్దఎత్తున పాల్గొని విశ్వకర్మ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామంలోని విశ్వకర్మ సంఘానికి చెందిన సభ్యులు కుల,పెద్దలు మహిళలు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి : డీఎస్పీ వెంకన్నబాబు

- **నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు**






**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం ఇల్లందు పోలీస్ స్టేషన్లో సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు డీఎస్పీ వెంకన్నబాబు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు ఇకపై ఎలాంటి నేర కార్యకలాపాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, నేరాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రౌడీషీటర్ల కదలికలు, ప్రవర్తనపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. ఎవరైనా బెదిరింపులు, దాడులు, అక్రమ కార్యకలాపాలు లేదా ఇతర నేరాలకు పాల్పడితే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.రౌడీషీటర్లు తమ గత నేర చరిత్రను పక్కనపెట్టి కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవిస్తూ, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని సూచించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని డీఎస్పీ వెంకన్న బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు సురేష్, సత్యనారాయణ, ఎస్సైలు తిరుపతి, ఉమా, సారంగపాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రాచలం గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- **డీజేలు, క్రాకర్స్‌కు అనుమతి లేదు : డీఎస్పీ అరుణ్ కుమార్**





**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జన ఏర్పాట్లను డీఎస్పీ అరుణ్ కుమార్ పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ సూచించారు. మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమానికి ఎవరూ రావద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని స్పష్టం చేశారు.అలాగే నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, క్రాకర్స్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నిమజ్జన ప్రాంతంలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత, నది పరిసరాల్లో రక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.నిమజ్జన బందోబస్తు కోసం సుమారు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో డిడిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ రక్షణ బృందాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని డీఎస్పీ అరుణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## మహా కుంకుమ పూజకు విశేష స్పందన



**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** పట్టణంలోని చెరువు బజార్లో శ్రీ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మహా కుంకుమ పూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 400 మంది మహిళా భక్తులు మహా కుంకుమ పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు సమర్పించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది.మహా కుంకుమ పూజను రాచకొండ రామ్మూర్తి దంపతులు, రాచకొండ బాబు దంపతులు, వారి కుటుంబ సభ్యులు సమర్పించారు. పూజా కార్యక్రమానికి హాజరైన భక్తులకు నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా శ్రీ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మహా కుంకుమ పూజను సమర్పించిన దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గణేష్ మహారాజు ఆశీస్సులతో దాత కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహా కుంకుమ పూజ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించడంతో పాటు, మహిళలలో భక్తిభావాన్ని మరింత పెంపొందించింది. కార్యక్రమం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

## మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో గణపయ్యకు ఘన వీడ్కోలు



**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయ ఆవరణలో ప్రతిష్ఠించిన మట్టి గణపయ్యకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఐదు రోజులపాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడిని భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు.క్యాంప్ కార్యాలయ ఆవరణలో గణపతి ఉత్సవాలతో పండుగ శోభ నెలకొంది. ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు, హారతులతో గణనాథుడిని కొలిచారు. శనివారం క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విఘ్నేశ్వరుడిని కదిలించారు.అనంతరం భక్తులు, నాయకులు, సిబ్బంది వెంట రాగా భక్తి పారవశ్యంతో వీ. వెంకటాయపాలెం చెరువుకు తరలించారు. 'గణపతి బప్పా మోరియా' నినాదాల మధ్య సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. దీంతో క్యాంప్ కార్యాలయంలో ఐదు రోజుల పాటు కొనసాగిన గణపతి ఉత్సవాలకు ఘనంగా ముగింపు పలికారు.

# గురుకుల విద్యాలయాల్లో నాసిరకం సరుకుల పంపిణీ

- పేద బిడ్డల కడుపు కొడుతున్న 'నేకాఫ్' కాంట్రాక్ట్ దందా
- రూ. 900 కోట్ల గురుకుల విద్యాలయాల అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- అమ్మలా ఆదరించాల్సిన ప్రభుత్వమే నాసిరకం కూటితో విషం చిమ్ముతోంది
- తెలంగాణ బిసి, ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్ట్ జేఏసీ జిల్లా కన్వీనర్ ఉదయ్ స్వేరో వారియర్ ఆగ్రహం




**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో చదువుకుంటున్న రెక్కాడితే గానీ డొక్కాడని పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పిల్లల భవిష్యత్తుతో ప్రభుత్వం రాక్షసంగా ఆడుకుంటోందని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్ట్ జేఏసీ జిల్లా కన్వీనర్ ఉదయ్ స్వేరో వారియర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గురుకుల విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం, స్వేరోస్ నెట్‌వర్క్, భీమ్ వారియర్స్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ బిడ్డలు బాగా చదువుకొని, పౌష్టికాహారం తిని ప్రయోజకులు అవుతారన్న నమ్మకంతో గురుకులాలకు పంపితే, ప్రభుత్వం మాత్రం కాసుల కక్కుర్తి కోసం కల్తీ సరుకులు పంపిణీ చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.బ్లాక్ లిస్ట్‌లో ఉన్న 'నేకాఫ్' అనే సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా రూ. 900 కోట్ల నిత్యవసర సరుకుల కాంట్రాక్టును కట్టబెట్టడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఈ జీవో నెం. 17ను రద్దు చేసి, ఈ దందాలపై 'సిట్' ఏర్పాటుచేసి, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో పూర్తి స్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.కల్తీ ఆహారంతో క్యాన్సర్ ముప్పు : జీవో 17తో వికేంద్రీకరణకు ముగింపువిద్యార్థులకు అందించే ఆహారంలో బ్రాండ్ లేని నాసిరకం గోధుమపిండి, గంటసేపైనా ఉడకని ఆఫ్రికన్ పప్పులు, కల్తీ నూనెలు సరఫరా చేస్తున్నారని నాయకులు మండిపడ్డారు. మార్కెట్‌లో కేజీ రూ. 50 ఉండే గోధుమపిండిని రూ. 66కి, రూ. 40 ఉండే చక్కెరను రూ. 60కి, రూ. 221 ఉండే ఎండుమిర్చిని రూ. 350 చొప్పున అధిక ధరలకు చూపిస్తూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ నాసిరకం, కల్తీ ఆహారం తినడం వల్ల విద్యార్థులు పౌష్టికాహార లోపంతో పాటు మానసిక ఆందోళనలు, శరీర ధృఢత్వం కోల్పోవడం, చివరికి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.సంక్షేమ అధికారులు, ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కూడిన కమిటీల ద్వారా నాణ్యమైన సరుకులు వచ్చాయో లేదో పరిశీలన చేసేవారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ కమిటీలను రద్దు చేసి సెంట్రలైజ్డ్ టెండర్ల పేరిట చిరు వ్యాపారుల పొట్ట కొడుతోందని విమర్శించారు. అధిక ధరల వల్ల విద్యార్థులకు వారానికి ఐదు రోజులు ఇవ్వాల్సిన గుడ్లను రెండు, మూడు రోజులకు కుదించి, అవి కూడా నాసిరకం (తక్కువ గ్రేడ్) గుడ్లను అందిస్తున్నారని ఆవేదన చెందారు.అదృశ్య శక్తుల చేతిలో 'నేకాఫ్'.. రద్దు చేయకపోతే ప్రజాక్షేత్రంలో ఉద్యమం ఖాయంగతంలో ప్రభుత్వ మార్క్‌ఫెడ్ డిపార్ట్‌మెంట్ చేత బ్లాక్ లిస్ట్‌లో పెట్టబడిన 'నేకాఫ్' సంస్థకు ఏ ప్రాతిపదికన మళ్లీ టెండర్లు ఇచ్చారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని నాయకులు నిలదీశారు. అసలు నేకాఫ్ వెబ్‌సైట్‌లో బాధ్యుల పేర్లు ఉండవని, దానికి ఎండీ ఎవరో, అసలు కార్యాలయం ఎక్కడ ఉందో ఎవరికీ తెలియదని తెలిపారు. శ్రీనివాసరావు, మస్తాన్ రావు అనే వ్యక్తులు తెరవెనుక ఉండి ముడుపులు అప్పగించే పనిలో పడ్డారని, అధికారుల సమక్షంలోనే ఈ దోపిడీ జరుగుతోందని వారు ఆరోపించారు. తక్షణమే నాసిరకం సరుకుల కాంట్రాక్టును వెనక్కి తీసుకోకపోతే రాబోయే రోజుల్లో ఖమ్మం జిల్లా వేదికగా విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉపాధ్యాయ, ప్రజా సంఘాల మద్దతుతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ కో-కన్వీనర్ కంకణాల శ్రీనాథ్, స్వేరోస్ సీనియర్ నాయకులు దామెర్ల పృథ్వీ రాజ్, బక్క వెంకటేశ్వర్లు, తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు నారపోగు నాగయ్య, కోండ్రు రామచంద్రు, సోలెపోగు శ్యాంసుందర్, హాస్టల్స్ నాయకులు సాయి, ప్రేమ్ కుమార్, బహుజన నాయకుడు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# మహా కుంకుమ పూజకు విశేష స్పందన



**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** పట్టణంలోని చెరువు బజార్‌లో శ్రీ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా కుంకుమ పూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది మహిళా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.మహా కుంకుమ పూజను రాచకొండ రామ్మూర్తి దంపతులు. రాచకొండ బాబు దంపతులు, వారి కుటుంబ సభ్యులు సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. గణేష్ మహారాజు ఆశీస్సులతో దాతల కుటుంబాలకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా ఉద్యాన అధికారి ఎం వి మధుసూదన్, విజయ్ కుమార్, ఖలీల్ పాషా, కృష్ణ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# చింతకాని పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్






**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. శనివారం చింతకాని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.CCTNS (క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్)లో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పూర్తి స్థాయిలో అప్‌డేట్ చేయాలని, దర్యాప్తులో e-Sakshyaను సమర్థవంతంగా వినియోగించి, ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో భద్రపరచాలన్నారు. "NAT-GRID"(నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్) "TGCOP" (తెలంగాణ క్రిమినల్ ఆపరేషన్ పోర్టల్) వంటి సాంకేతిక వేదికలను దర్యాప్తులో సమర్థవంతంగా వినియోగించాలన్నారు. భూ వివాదాల కేసుల్లో నిర్దేశిత SOP (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) ను తప్పనిసరిగా పాటిస్తూ, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలన్నారు. చట్టపరమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగించాలని పేర్కొన్నారు.విద్యార్థులు, యువత, ప్రజలకు సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలు, ఓటిపి, యుపిఐ మోసాలు, ఫేక్ లింకులు, డిజిటల్ అరెస్టులపై ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కేసులను చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి, కేసుల డిస్పోజల్‌కు చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి కేసులో దర్యాప్తు నాణ్యత, ఆధారాల సేకరణ, కేసు డాక్యుమెంటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే స్వీకరించి, వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందించాలని,స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణ, నేరస్తులపై నిఘా, ప్రజలకు భద్రత కల్పించడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు.

# విద్యకు కాషాయికరణ ప్రమాదం

- పేదలను విద్యకు దూరం చేస్తున్న పాలకుల విధానాలు
- విద్యార్థి ఉద్యమాల సారథి ఏఐఎస్ఎఫ్
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్







**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** భారతదేశంలో విద్య కాషాయికరణ ప్రమాదంలో ఉందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ తెలిపారు. విద్యను కాషాయికరణ చేయడంతో పాటు చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నం జరుగుతుందని పసి మెదళ్లలో మతోన్మాదాన్ని నింపుతున్నారని ఆయన ఆరోపించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఖమ్మం జిల్లా 28వ మహాసభలు -శనివారం స్థానిక ఐఎంఏ హాల్ లో జరిగాయి. మహాసభలను పురస్కరించుకుని పాత సిపిఐ కార్యాలయం నెహ్రూ నగర్ నుండి పాత బస్టాండ్ మయూరిసెంటర్ మీదుగా పోటు ప్రసాద్ నగర్ (ఐఎంఏ హాల్) వరకు విద్యార్థి ప్రదర్శన నిర్వహించారు. 28వ -మహాసభకు గుర్తుగా 28 మంది విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ పతాకాలను ధరించి ముందు నడిచారు. ఈ ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో -విద్యార్థులు పాల్గొన్నారు. మహాసభలను పురస్కరించుకుని ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ ఆవిష్కరించారు. మడుపల్లి లక్ష్మణ్, బుర్రా మనోజ్, అమృత అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభల్లో పుట్టా -లక్ష్మణ్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమేపి విద్యా విధానాన్ని మారుస్తూ వచ్చిందని శాస్త్ర సాంకేతిక -పరిజ్ఞానం పరుగులు పెడుతున్న నేటి తరుణంలో చాందస వాదాన్ని పసిమెదళ్లలోకి చొప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బడ్జెట్లో విద్యకు నిధుల కేటాయింపు పూర్తిగా తగ్గిపోయిందని కేటాయించిన బడ్జెట్ను కూడా ఖర్చు చేయడం -లేదని లక్ష్మణ్ ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే విద్యకు అత్యంత ప్రాధన్యతనిస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి పాలన ఆ ఆదిశగా సాగడం లేదన్నారు. ఫీజు రీయంబర్స్మెంట్ విషయంలో ఆయన ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి పేద, మధ్య తరగతి -విద్యార్థులను విద్యకు దూరం చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేటులో ఫీజులను నియంత్రించాల్సిన ఈ ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందిందన్నారు. ఏఐఎస్ఎఫ్ భారతదేశంలోనే అతి గొప్ప విద్యార్థి సంఘమని స్వాతంత్ర్యానికి ముందు స్వాతంత్ర్యం తర్వాత అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించిన ఘన చరిత్ర ఏఐఎస్ఎఫ్కు ఉందన్నారు. -విద్యా రంగ సమస్యలపైనే కాకుండా సామాజిక సమస్యలు, నిరుద్యోగం తదితర సమస్యలపై ఏఐఎస్ఎఫ్ పోరాడుతూ విద్యార్థి ఉద్యమ సారధిగా నిలిచిందన్నారు. అనేక మంది యోధులు ఏఐఎస్ఎఫ్ పనిచేశారని వారందరి స్ఫూర్తితో ఏఐఎస్ఎఫ్ -బహుముఖ పోరాటాల ద్వారా విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. ఏఐఎస్ఎఫ్ సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశ విద్యారంగం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని పోరాటాలు -మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం చూపుతాయన్నారు. విద్య అంగడి వస్తువుగా మారిందని కొనుగోలు శక్తి ఉన్న వారికే విద్య "అందుబాటులో ఉందన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ నేతృత్వంలో పోరాడాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ఇంచార్జి రావిశివరామకృష్ణ, మహిళా -సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తినేని నీరజ, ఏపూరి లతాదేవి, ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి, చింతల రమేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరంలోనిపలు గణేష్ ఉత్సవ కమిటీల అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ తోట గోవిందమ్మ, రామారావు





**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆధ్యాత్మికంగా ప్రతిష్టాపన చేసిన వినాయక మండపాల్లో శనివారం మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు తోట దంపతులురామారావు, గోవిందమ్మ పాల్గొని గణనాథుని దర్శనం చేసుకుని ఆ స్వామివారి కృపకు పాత్రులైవిధంగా విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూహిందువుల అతి ముఖ్య పండుగ వినాయకచవితి అని ఈ పండుగను సార్వజనిక సామూహిక ఉత్సాహంగా జరుపుకోవాలని ఆనవాయితీగా వస్తుందని ఇది ప్రజల్లో ఐక్యతను, భక్తి భావాన్ని పెంచుతుందని ఈ పండుగను పురస్కరించుకొని వాడ వాడల గణనాథుని ప్రతిష్టాపనతో ఆధ్యాత్మికత వెల్లువిరుస్తుందని కొనియాడారు. తదనంతరం మహా అన్న ప్రసాద కార్యక్రమము చేస్తున్న పలు ఉత్సవ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పలు ఉత్సవ కమిటీ సభ్యులు ముఖ్య ఆహ్వానితులుగా విచ్చేసిన తోట దంపతులను సన్మానించారు. మహా అన్న ప్రసాద కార్యక్రమ నిర్వాణలో ఉత్సవ కమిటీ సభ్యులు భక్త బృందం పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం జిల్లా బ్రాంచ్ పాలకవర్గ సభ్యుల ఎన్నికల షెడ్యూల్ విడుదల : ముఖ్య ప్రణాళికా అధికారి, ఎన్నికల అధికారి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీనివాస్

**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్ సి ఎస్) ఖమ్మం జిల్లా బ్రాంచ్ యొక్క పాలకవర్గ సభ్యుల ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటీసు, షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి, జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి ఏ. శ్రీనివాస్ శనివారం విడుదల చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఎన్నికల ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 15 జిల్లా కార్యవర్గ సభ్యుల స్థానాలకు గాను ఈ ఎన్నికలు జరగనున్నాయని, నామినేషన్ రుసుము రూ.10,000/– (తిరిగి చెల్లించబడదు) గా నిర్ణయించామన్నారు. ఎన్నికల నామినేషన్ల దాఖలు ఈ నెల 24 న ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ఐడిఓసి, కలెక్టరేట్, ఖమ్మం నందు స్వీకరిస్తారని తెలిపారు. నామినేషన్ల పరిశీలన ఈ నెల 25 న ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఉంటుందని అన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 26 న ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఉంటుందని, అర్హమైన నామినేషన్ల తుది జాబితాను ఈ నెల 26 న మధ్యాహ్నం 3:00 గంటల తర్వాత ప్రకటిస్తామన్నారు. ఏకగ్రీవ అభ్యర్థుల ప్రకటన (పోటీ లేని పక్షంలో) ఈ నెల 26న సాయంత్రం 5:00 గంటల తర్వాత చేయనున్నట్లు ఎన్నికల అధికారి అన్నారు.పోలింగ్ ను అక్టోబర్ 4 న (ఆదివారం) ఉదయం 8:00 నుండి మధ్యాహ్నం 3:00 వరకు టీటీడీసీ భవనం, ఇల్లందు క్రాస్ రోడ్, రామాలయం దగ్గర, ఖమ్మం లో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఓట్ల లెక్కింపు, ఫలితాలు & ఆఫీస్ బేరర్ల ఎంపిక అక్టోబర్ 4 న పోలింగ్ ముగిసిన తదుపరి చేపట్టనున్నట్లు అన్నారు.నామినేషన్ పత్రాలను ఐడిఓసి, కలెక్టరేట్ ఖమ్మంలోని రూమ్ నెం: ఎఫ్ –27 ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయం నందు పొందవచ్చని, పోటీ చేసే అభ్యర్థి నామినేషన్ పత్రమును స్వయంగా మొదటి మరియు రెండవ ప్రపోజర్లతో కలసి ఎన్నికల అధికారికి అందజేయాలని అన్నారు. ఒక వ్యక్తి ఒక్క అభ్యర్థికి మాత్రమే ప్రపోజర్‌గా (మొదటి లేదా రెండవ) ఉండాలని, నామినేషన్‌తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను సమర్పించాలని అన్నారు. ఓటు వేయడానికి వచ్చే సభ్యులు తప్పనిసరిగా ఐఆర్సిఎస్ గుర్తింపు కార్డు / ఆధార్ కార్డు లేదా ఇతర ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును తెచ్చుకోవాలన్నారు.మరిన్ని వివరాలకు, ఓటర్ల జాబితా కొరకు ఎన్నికల అధికారి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఎన్నికల అధికారి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

## సివిల్ సర్వీసెస్-2027 ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం : జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఫిరంగి

**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్ సి) నిర్వహించే సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ)–2027 పరీక్షల కోసం ఎస్.టి, ఎస్.సి, బి.సి. అభ్యర్థులకు రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఫిరంగి ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ (టిసి ఆర్ అండ్ టిఐ ), శ్రీరామ్స్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ భాగస్వామ్యంతో రాజేంద్రనగర్‌లోని మానస హిల్స్ వద్ద గల ఎస్టీ స్టడీ సర్కిల్‌లో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందని అన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా 100 మందిని (ఎస్టీ–75, ఎస్సీ–15, బీసీ–10) ఎంపిక చేస్తారని, గత ఐదేళ్లలో ప్రిలిమ్స్ అర్హత సాధించిన ఎస్టీ అభ్యర్థులను మరో 20 మందిని కలిపి మొత్తం 120 మందిని ఈ శిక్షణకు ఎంపిక చేయడం జరుగుతుందని ఉప సంచాలకులు అన్నారు. డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని, 21 నుండి 32 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, వికలాంగ అభ్యర్థులకు 35 సంవత్సరాల వరకు మినహాయింపు ఉంటుందని, కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3 లక్షలలోపు ఉండాలని అన్నారు.ఎంపికైన అభ్యర్థులకు 8 నెలల పాటు ఉచిత వసతి, భోజనంతో పాటు స్టడీ మెటీరియల్ అందిస్తారని ఉప సంచాలకులు అన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి ఈ నెల 23వ తేదీ వరకు గడువు ఉందని, ప్రవేశ పరీక్ష నెల 27వ తేదీన నిర్వహించబడుతుందని, సర్టిఫికేట్ల పరిశీలన, ఇంటర్వ్యూలు అక్టోబరు 1వ తేదీన చేపట్టి, ఎంపిక జాబితా ప్రకటన అక్టోబరు 2 న చేయనున్నట్లు తెలిపారు. తరగతులు అక్టోబరు 5వ తేదీ నుండి ప్రారంభమవుతాయని, ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు, ఇతర వివరాల కోసం https://welfare.sri–ramsias.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఉప సంచాలకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రోగుల భద్రత, నాణ్యమైన వైద్య సేవలే ధ్యేయం : జిల్లా వైద్య, ఆరోగ్య ఆరోగ్యశాఖ అధికారి ఖమ్మం డాక్టర్ డి రామారావు







**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** పాలేరు నర్సింగ్ అండ్ మెడికల్ కాలేజీలో " పేషంట్ సేఫ్టీ వారోత్సవాలలో భాగంగా, ఈరోజు వరల్డ్ స్నేక్ బైట్ అవేర్‌నెస్ డే' పురస్కరించుకొని, శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు మాట్లాడుతూవైద్య చికిత్సలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం, రోగుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వడం,ప్రతి వైద్యుడి, ఆరోగ్య కార్యకర్త ప్రాథమిక బాధ్యత అని,శనివారం,ఖమ్మం రూరల్, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పాలేరు నర్సింగ్ అండ్ మెడికల్ కాలేజీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 'పేషెంట్ సేఫ్టీ వీక్' (సెప్టెంబర్ 14 నుంచి 20 వరకు), అలాగే 'వరల్డ్ స్నేక్ బైట్ అవేర్‌నెస్ డే' అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా డా. రామారావు మాట్లాడుతు,రోగుల భద్రత – నిరంతర పర్యవేక్షణ ఆసుపత్రుల్లో సరైన రోగ నిర్ధారణ సురక్షితమైన మందుల పంపిణీ ఇన్‌ఫెక్షన్ల నియంత్రణ వంటి అంశాల్లో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలి అని,రోగులు, వారి బంధువులు కూడా తమకు అందుతున్న వైద్య చికిత్స, మందుల వివరాలపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. పాముకాటు – అపోహలు వీడాలి, ప్రాణాలు కాపాడాలి గ్రామీణ, గిరిజన ప్రాంత ప్రజల్లో పాముకాట పట్ల మూఢనమ్మకాలు, అపోహలను వీడాలని రామారావు సూచించారు.తక్షణమే ప్రథమ చికిత్స బాధితుడిని కంగారు పడకుండా ప్రశాంతంగా ఉంచాలి,కాటు వేసిన శరీర భాగాన్ని వీలైనంత కదలకుండా స్థిరంగా ఉంచాలి,శరీరానికి ఉన్న గాజులు, ఉంగరాలు, బిగుతైన బట్టలను వెంటనే తొలగించాలి అని,ఏమాత్రం ఆలస్యం చేయకుండా 108 లేదా ఇతర వాహనాల ద్వారా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాల ని, గాయం వద్ద బ్లేడులతో కోయడం, విషాన్ని నోటితో పీల్చడం చేయకూడదు అని,రక్త ప్రసరణ ఆగిపోయేలా గట్టిగా తాడు లేదా వస్త్రంతో కట్లు కట్టరాదు అని,మంత్రాలు, తాయెత్తులు, నాటు వైద్యం పేరుతో విలువైన కాలాన్ని వృధా చేయకూడదు అని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా 'యాంటీ–స్నేక్ వెనమ్' జిల్లా కేంద్ర ప్రధాన ఆసుపత్రితో పాటు ఖమ్మం జిల్లాలోని అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాముకాటు విరుగుడు ఇంజెక్షన్లు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని రామారావు తెలిపారు. వర్షాకాలంలో పొలాల్లో పనులకు వెళ్లే రైతులు, కూలీలు గమ్ బూట్లు ధరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పాలేరు మెడికల్ అండ్ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, వైద్య అధ్యాపకులు, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పీఆర్టీయూ కూసుమంచి మండల అధ్యక్షుడిగా శీలం ఆంజనేయులు

- ప్రధాన కార్యదర్శిగా ఎం. సతీష్ ఏకగ్రీవ ఎన్నిక




**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** పీఆర్టీయూ టీఎస్ కూసుమంచి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కూసుమంచిలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.మండల అధ్యక్షుడిగా శీలం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఎం. సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా ఏ. లక్ష్మీనారాయణ, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా సీహెచ్. కృష్ణవేణి, ఉపాధ్యక్షులుగా బి. పాపారావు, సీహెచ్. మురళీమోహన్, మహిళా ఉపాధ్యక్షురాలిగా పి. విజయరూపిణి ఎన్నికయ్యారు.కార్యదర్శులుగా బి. ఉపేందర్‌రావు, డి. నాగేశ్వరరావు, మహిళా కార్యదర్శులుగా బి. చైతన్య రవళి, కే. వాణి, జె. సునీత, షబానా బేగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ తమపై విశ్వాసంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న పీఆర్టీయూ కూసుమంచి మండల కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, సభ్యులందరినీ సమన్వయం చేసుకుని సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం, సంఘ ఐక్యతకు ప్రాధాన్యమిస్తూ నిరంతరం పనిచేస్తామని తెలిపారు.కార్యక్రమంలో పీఆర్టీయూ–టీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు, పీఆర్టీయూ మాసపత్రిక ఎడిటోరియల్ సభ్యులు జి. వెంకటరమణ, రాష్ట్ర బాధ్యులు కే. రాజశేఖర్, మల్లికార్జున్, సోమయ్య, అనంత్, జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్, సర్వర్ మియా, ఈర్ల కృష్ణతో పాటు పలువురు ఉపాధ్యాయులు, పీఆర్టీయూ సభ్యులు పాల్గొన్నారు.

## బాలికకు న్యాయం దక్కకుండా బెదిరింపుల పర్వం

- పోక్సో కేసులో సాక్ష్యం చెప్పొద్దంటూ నిమ్స్‌లో బాధితురాలికి హెచ్చరికలు
- గౌస్‌పాషా కుటుంబ సభ్యులపై కేసు
- ఖమ్మం ఘటనలో మరో మలుపు
- బాధిత కుటుంబంలో ఆందోళన

**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో మైనర్ బాలికపై లైంగికదాడికి యత్నించి భవనం పైనుంచి తోసివేసిన ఘటనలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తీవ్ర గాయాలతో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధిత బాలికను కోర్టులో నిందితుడికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పొద్దంటూ బెదిరించినట్లు ఆమె తండ్రి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా నిందితుడు మహ్మద్ గౌస్‌పాషా కుటుంబానికి చెందిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తాజా సమాచారం.జూన్ 6న ఖమ్మం నగరంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో 12 ఏళ్ల బాలికపై గౌస్‌పాషా లైంగికదాడికి యత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. విషయం బయటకు రాకుండా బాలికను భవనం పైనుంచి కిందకు తోసివేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. తీవ్ర గాయాలతో బాలిక ఆసుపత్రిలో చేరగా ఆమె స్పృహలోకి వచ్చిన తర్వాత జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో గౌస్‌పాషాపై పోక్సోతో పాటు హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి.––– మూడు నెలలుగా నిమ్స్‌లో చికిత్స తీవ్ర గాయాల కారణంగా బాలికను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. సుమారు మూడు నెలలుగా అక్కడే చికిత్స పొందుతుంది. ఈ క్రమంలో కోర్టులో సాక్ష్యం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడటంతో కేసు మరింత కీలక దశకు చేరింది.ఈ నేపథ్యంలో గౌస్ కుటుంబీకులుసాక్ష్యం చెప్పొద్దంటూ వార్డులోనే బెదిరించినట్లు తెలిసింది. ఈ నెల 16న బాలిక ఉన్న నిమ్స్ వార్డులోకి ముగ్గురు మహిళలు వచ్చి గౌస్‌పాషాకు వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యం చెప్పవద్దంటూ బెదిరించినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. వారి ఫిర్యాదుతో పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.ఒకవైపు ప్రాణాపాయ స్థితి నుంచి కోలుకుంటున్న బాలికకు వైద్యం కొనసాగుతుండగా మరోవైపు కేసులో సాక్ష్యం కీలకంగా మారిన సమయంలోనే బెదిరింపుల ఆరోపణలు తెరపైకి రావడం చర్చనీయాంశమైంది. బాధితురాలి కుటుంబానికి భద్రత కల్పించడం, బెదిరింపుల ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయడం, కేసు విచారణను ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా కొనసాగించడం ఇప్పుడు పోలీసుల ముందున్న కీలక అంశాలుగా మారాయి.

నేటి శుభోదయ
తెలుగు దినపత్రిక
ఆదివారం | హైదరాబాద్
20 - 09 - 2026
www.netisubhodaya.com



## మెడిసిన్ సీటు సాధించిన రోకటి సుష్మకు అభినందనలు తెలిపిన శెట్టి రంగారావు



**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా, జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన రోకటి రమేష్ – ప్రమీల చిన్న కూతురు ఏం బి బి ఎస్ సీటు సాధించిన సందర్భంగా రోకటి సుష్మకు ఖమ్మం రాపర్తి క్యాంప్ ఆఫీస్ నందు ఘనంగా సన్మానం చేసి అభినందనలు తెలుపుతూ ఆర్థిక సహకారం అందించిన మున్నూరు కాపు పటేల్స్ రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు, ట్రస్టు బోర్డు చైర్మన్ కనకం జనార్ధన్ రావు, కార్యదర్శి కనిశెట్టి నర్సయ్య, జిల్లా కోశాధికారి మడూరీ పూర్ణ చందర్ రావు, సీనియర్ నాయకులు కాపు జేఏసీ చందు జనార్ధన్, డాక్టర్ గడల శ్రీనివాసరావు,తీగల విజయ్, రాపర్తి శరత్ కుమార్,డాక్టర్ జాబిశెట్టి గౌతమ్, ముత్యం ఉప్పలరావు, సముద్రాల శ్రీనివాసరావు, జిల్లా యూత్ అధ్యక్షులు తోట రమేష్,సూరపనేని బాబురావు, గంగిశెట్టి శ్రీనివాస్,సి హెచ్ విప్లవ కుమార్, పసుపులేటి నాగేశ్వరరావు, బైరిశెట్టి శ్రీనివాసరావు, తాళ్లూరి సోమయ్య, రామిశెట్టి సత్యనారాయణ, వెంపటి నాగేశ్వరరావు నాయుడు , రాపర్తి అరవింద్,రంగిశెట్టి వరుణ్,కాసం వినయ్, జి శ్రీదేవి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న కాలంలో మంచిగా చదువుకుని మంచి డాక్టర్ గా రాణించాలని కష్టపడి చదివించిన తల్లి తండ్రులుకు కూడా ఈ సందర్భంగా సన్మానం చేసి అభినందనలు తెలియచేయడం జరిగింది.

## ఘనంగా శ్రీ సాయి గణేష్ పద్మశాలి ఉత్సవ కమిటీ వారి కుంకుమ పూజ







**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని 40వ డివిజన్‌లో శ్రీ గణేష్ పద్మశాలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 21వ వినాయకుడి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కుంకుమ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ పెద్దలు మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు పద్మశాలి కళ్యాణ మండపం నందు ప్రతి సంవత్సరం శ్రీ గణేష్ పద్మశాలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహిస్తాము అని మాకు కుల బాంధవులు అందరూ కూడా సహకరిస్తారని అదేవిధంగా ఈ గణేష్ మండపం వద్ద ఎటువంటి కోరికలు కోరుకున్న వెంటనే నెరవేరుతాయి అని ఇక్కడ మహిళా భక్తులు అపారంగా నమ్ముతున్నారని అన్నారు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజ నిర్వహించడం ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంచింది అని పేర్కొన్నారు కుంకుమ పూజ అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి మహిళకు శ్రీ గణేష్ పద్మశాలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక బహుమతిని అందజేసారుఈ సందర్భంగా శ్రీ గణేష్ పద్మశాలి ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 21వ వినాయకుడి వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన కుంకుమ పూజకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా భక్తుల సహకారంతో మరిన్ని ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూరపాటి సతీష్,అమృతం మల్లికార్జున్,చిలుకోటి శ్రీనివాస్ రావు, వలన కొండ నరసింహారావు, గుర్రం రవీంద్రనాథ్ (కవి) ముసునూరి వెంకటేశ్వర్లు, మేక జగదీష్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 136 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- **రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి చొరవతో మంజూరు**
- **లబ్ధిదారులకు అందజేసిన మంత్రి పొంగులేటి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి**



**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** నిదలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఆర్థికంగా అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా సహాయం అందిస్తోందని తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం నేలకొండపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 136 మంది లబ్ధిదారులకు మంత్రి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం చేయించుకున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పేదల వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు.--- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని దయాకర్‌రెడ్డి తెలిపారు. నేలకొండపల్లి మండలంలో త్వరలోనే ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తవుతుందని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ పంటలు సాగు చేపట్టిన రైతులకు ఇబ్బందులు కలగకుండా పాలేరు రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందించినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించడమే మంత్రి పొంగులేటి లక్ష్యమని వివరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొడాలి గోవిందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బొందయ్య, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మామిడి వెంకన్న, పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సామాజిక చైతన్యానికి శ్రీనివాసరావు రచనలు అక్షర ఆయుధాలు

- **జర్నలిస్టుల హక్కుల పోరాటంలో ఆయన కలం అవసరం : సయ్యద్ ఖదీర్**
- **సమాజాన్ని మేల్కొలిపే రచయిత శ్రీనివాసరావుటిడబ్ల్యూజేఎఫ్ నాయకులు**





**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బోనకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం, మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.పరిశుభ్రమైన వాతావరణం వల్ల అనేక రకాల వ్యాధులను నివారించవచ్చని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రత ఎంతో ముఖ్యమని తెలిపారు. పాఠశాల విద్యార్థులు కూడా మొక్కల సంరక్షణపై అవగాహన పెంచుకుని, తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.“వ్యాధులు సోకకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం.. పచ్చదనాన్ని పెంచి ఆరోగ్యకరమైన బోనకల్‌ను నిర్మిద్దాం” అని సర్పంచ్ బానోతు జ్యోతి కొండ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాను కొండ, పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ డివిలు స్తంభాలు మరియు తీగలను వెంటనే తొలగించాలి : సిపిఐ డిమాండ్



**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో ప్రమాదకరంగా మారిన డివిలను స్తంభాలను తీగలను తక్షణమే తొలగించాలని అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటలాడుతున్నారని ఏదో నామ్కే వాస్తు కేవలం చెట్ల మండలం కొట్టడానికి పనికి వస్తున్నాడు తప్ప మిగతా ప్రమాదకరమైన స్తంభాలను తొలగించడం గాని తీగలను సరి చేయడం గాని జరగట్లేదని చిన్న గాలి వచ్చిన తీగలు తగిలి నిప్పురవ్వలు రావడం వాహనాలు దారుల మీద పడటం తీవ్ర ఇబ్బందిగా మారిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహమ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు యానాల సాంబశివరెడ్డి తీవ్రంగా విమర్శించారు. శనివారం స్థానిక నరసింహస్వామి గుడి వద్ద కనకదుర్గమ్మ గుడి పక్కన ఉన్న అటువంటి ట్రాన్స్పారం పూర్తిగా ఉండిపోయిందని దానిని తొలగించాలని అనేకసార్లు అధికారులకు వినియోగించడం జరిగిందని కేవలం మామూలు ఇస్తే ఏ పని అయినా చేస్తాం అనే తీరును అధికారులు వ్యవహరిస్తున్నారని సమయం లేని సమయంలో కరెంటు పోతుంది ప్రధాన ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ డివిలకు కింద వేసిన పిల్లర్లు కృంగిపోతున్నాయి, తీగలు వేలాడుతున్నాయి. స్కూలు సమీపంలో పిల్లలు ఆడుకునే ప్రాంతాల్లో ప్రమాదకరంగా తీగలు, స్తంభాలు ఉన్నాయి తక్షణమే వీటిని అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు తీగలను, డివిలలో మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్శన కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు మహమ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు యానాల సాంబశివ రెడ్డి, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు సిహెచ్ దుర్గానాథ్, నగర నాయకులు ఎండి మజీద్, అక్బర్, పీర్ సాహెబ్ స్థానికులు పాల్గొన్నారు.

## యూపీఐపై ఎండీఆర్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలి

- **ప్రజలపై పరోక్ష భారం మోపడం సరికాదు : సీపీఎం**

**ఖమ్మం, సెప్టెంబర్ 19, నేటి శుభోదయ :** యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ చార్జీలు విధించే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్. నవీన్ రెడ్డి ఒక ప్రకటన లో డిమాండ్ చేశారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించి ప్రజలకు ఉచిత యూపీఐ సేవలను అలవాటు చేసిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు చార్జీల పేరుతో కొత్త భారం మోపడం సరికాదన్నారు. వ్యాపారులపై పడే అదనపు ఖర్చు చివరకు వస్తువులు, సేవల ధరల రూపంలో ప్రజలపైనే పడే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే పెరుగుతున్న నిత్యావసర ధరలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులపై మరో పరోక్ష భారం మోపవద్దని అన్నారు. ప్రజల వినియోగంతో అభివృద్ధి చెందిన యూపీఐ వ్యవస్థను ప్రైవేట్ సంస్థలకు ఆదాయ వనరుగా మార్చకుండా, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా నిర్వహించాలని కోరారు. ప్రజలపై ఎటువంటి ప్రత్యక్ష, పరోక్ష భారం పడకుండా యూపీఐ లావాదేవీలపై ప్రతిపాదించిన ఎండీఆర్ చార్జీలను పూర్తిగా రద్దు చేయాలని, యూపీఐ సేవలను ఉచితంగా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎస్. నవీన్ రెడ్డి డిమాండ్ చేశారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక
ఆదివారం | హైదరాబాద్
20 - 09 - 2026
www.netisubhodaya.com


# ఖమ్మం నగరంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బిర్యానీ కేంద్రాలు





**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం నగరం, అర్బన్ ఏరియా, ఖమ్మం రూరల్, ఏదులాపురం వంటి ఏరియాలో బిర్యానీ కేంద్రాలు, కిచిడీ దుకాణాలు, చికెన్ వంటకాల విక్రయ కేంద్రాలు, వేయించిన పదార్థాల బండ్లు, అల్పాహార కేంద్రాలు, రహదారి పక్కన ఉన్న భోజనశాలలు, పంజాబీ దాబాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తక్కువ ధరకు రుచికరమైన ఆహారం అందిస్తున్నామనే పేరుతో అనేక చోట్ల వ్యాపారం సాగుతున్నప్పటికీ, ఆహార పదార్థాల నాణ్యత, వంట నూనెల వినియోగం, పరిశుభ్రత, నిల్వ విధానం, మాంసాహార పదార్థాల భద్రత వంటి అంశాలపై సమగ్ర తనిఖీలు జరుగుతున్నాయా అనే ప్రశ్నలు స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

## రుచే ముఖ్యమా, ఆరోగ్యం అక్కర్లేదా?

ఖమ్మం నగరం, ఏదులాపురం, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్ ప్రాంతాల్లో బిర్యానీ, కిచిడీ, చికెన్ పకోడీ, వేయించిన బియ్యపు వంటకాలు, బజ్జీలు, బోండాలు తదితర ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నాయి. అయితే కొన్ని కేంద్రాల్లో ఉపయోగిస్తున్న ముడి పదార్థాల నాణ్యత, వంట నూనె పరిస్థితి, ఆహారాన్ని తయారు చేసే ప్రదేశాల పరిశుభ్రతపై వినియోగదారుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఒకసారి ఉపయోగించిన నూనెను పలుమార్లు వేడి చేసి ఉపయోగించడం జరుగుతుందా? నాణ్యత లేని నూనెలు వినియోగిస్తున్నారా? ఆహార పదార్థాల తయారీలో అనుమతించని రంగులు లేదా ఇతర పదార్థాలు కలుపుతున్నారా? అనే అంశాలపై అధికారులు శాస్త్రీయంగా పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

## చికెన్ వంటకాల తయారీలో జాగ్రత్తలు పాటిస్తున్నారా?

చికెన్ పకోడీ, చికెన్ వేపుడు, ఇతర మాంసాహార వంటకాల విషయంలో మాంసం నిల్వ విధానం అత్యంత కీలకం. మాంసాన్ని సరైన ఉష్ణోగ్రతలో భద్రపరచకపోవడం, ఎక్కువసేపు బయట ఉంచడం, శుభ్రమైన నీటితో శుభ్రపరచకపోవడం, వండిన ఆహారాన్ని ఎక్కువసేపు నిల్వ చేయడం వంటి అంశాలు ఆహార భద్రతకు సంబంధించిన ముఖ్యమైన విషయాలు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని మాంసాహార ఆహార కేంద్రాల్లో నిల్వ గదులు, శీతలీకరణ పరికరాలు, మాంసం కొనుగోలు వివరాలు, తయారీ ప్రదేశాల పరిశుభ్రత తదితర అంశాలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

## బజ్జీ, బోండా బండ్లలో నూనె ఎన్నిసార్లు?

రోడ్డు పక్కన నిర్వహిస్తున్న బజ్జీ, బోండా, పకోడీ, చికెన్ వేయింపు కేంద్రాల్లో వంట నూనె వినియోగంపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకసారి లేదా రెండుసార్లు వినియోగించిన నూనెను మళ్లీ మళ్లీ అధిక ఉష్ణోగ్రతకు వేడి చేయడం వల్ల నూనెలో అవాంఛిత మార్పులు సంభవించే అవకాశం ఉందని ఆహార నిపుణులు సూచిస్తున్నారు. అందువల్ల ఇలాంటి కేంద్రాల్లో వాడుతున్న నూనె నాణ్యతను సంబంధిత అధికారులు తనిఖీ చేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకోవాలని ఖమ్మం నగర ప్రజలు కోరుతున్నారు.

## రంగులు, రుచుల కోసం అడ్డగోలు ప్రయోగాలా?

ఆహార పదార్థాలకు ఆకర్షణీయమైన రంగు, రుచి తీసుకురావడానికి అనుమతించబడిన ఆహార సంకలితాలను మాత్రమే నిర్ణీత పరిమితుల్లో ఉపయోగించాల్సి ఉంటుంది. కానీ నాణ్యత లేని లేదా అనుమతులు లేని రంగులు, రుచి పదార్థాలు వినియోగిస్తున్నారనే అనుమానాలు ఉంటే వాటిపై అధికారులు నమూనాలు సేకరించి ప్రయోగశాల పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రజలు తినే ఆహారం కావడంతో కేవలం దుకాణం పరిశుభ్రంగా కనిపిస్తుందా లేదా అనే దానితో తనిఖీని పరిమితం చేయకుండా ముడి పదార్థాల నుంచి తయారీ, నిల్వ, విక్రయం వరకు మొత్తం ప్రక్రియను పరిశీలించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

## ఖమ్మం నగర పరిధిలో గల దాబాలపై కూడా దృష్టి సారించాలి

ఖమ్మం నగర పరిధిలోని ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, ఏదులాపురం మధ్య రహదారి ప్రాంతంలో పలు పంజాబీ దాబాలు నిర్వహించబడుతున్నాయి. రహదారి ప్రయాణికులు, స్థానికులు, వాహనదారులు ఈ దాబాల్లో ఆహారం తీసుకుంటున్నారు. అయితే కొన్ని దాబాల్లో వంట ప్రదేశాల పరిశుభ్రత, వంట నూనెల వినియోగం, మాంసాహార పదార్థాల నిల్వ, తాగునీటి నాణ్యత, వ్యర్థాల నిర్వహణ వంటి



అంశాలను అధికారులు తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. రహదారి పక్కన ఆహార విక్రయ కేంద్రాలు కావడంతో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు.

## వర్షాకాలం మరింత అప్రమత్తత అవసరం

వరాకాలంలో ఆహార పదార్థాల నిల్వ, నీటి పరిశుభ్రత, పరిసరాల పారిశుద్ధ్యం వంటి అంశాల్లో నిర్లక్ష్యం జరిగితే ఆహార కలుషితానికి సంబంధించిన సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో తయారు చేసి విక్రయించే ఆహార పదార్థాలు, మాంసాహార వంటకాలు, వేయించిన పదార్థాల విషయంలో మరింత జాగ్రత్త అవసరం. ఈ పరిస్థితుల్లో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని కేంద్రాలను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.

## దుకాణాల సంఖ్య పెరుగుతోంది, తనిఖీల సంఖ్య ఎంత?

ఖమ్మం నియోజకవర్గంలో ఆహార విక్రయ కేంద్రాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో సంబంధిత శాఖల వద్ద వాటి నమోదు, అనుమతులు, తనిఖీల వివరాలు ఎంత మేరకు ఉన్నాయి అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బిర్యానీ కేంద్రాలు, దాబాలు, చిన్న భోజనశాలలు, అల్పాహార కేంద్రాలు, రహదారి పక్కన ఆహార విక్రయ కేంద్రాలపై ఎప్పుడు తనిఖీలు నిర్వహించారు? ఎన్ని నమూనాలు సేకరించారు? ఎన్ని నమూనాలు ప్రయోగశాలకు పంపారు? నాణ్యతలో లోపాలు గుర్తించిన సందర్భాల్లో ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

## నమూనాలు సేకరిస్తేనే అసలు విషయం బయటపడే అవకాశం

ఆహారం నాణ్యతపై కేవలం ఆరోపణలు లేదా అనుమానాల ఆధారంగా నిర్ణయానికి రావడం కంటే, సంబంధిత అధికారులు శాస్త్రీయ పద్ధతిలో ఆహార నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించడం కీలకం. వంట నూనె, బిర్యానీ, కిచిడీ, చికెన్ వంటకాలు, ఉపయోగిస్తున్న రంగులు, రుచి పదార్థాలు, తాగునీరు వంటి వాటి నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపితే నాణ్యతపై స్పష్టమైన ఆధారాలు లభించే అవకాశం ఉంటుంది. పరీక్షల్లో నిబంధనలకు విరుద్ధమైన అంశాలు బయటపడితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అధికారుల ఆకస్మిక తనిఖీలు ఎప్పుడు?

ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, ఏదులాపురం తదితర ప్రాంతాలలో సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఆహార కేంద్రాల వాస్తవ పరిస్థితిని పరిశీలించాలనే డిమాండ్ పెరుగుతోంది. ముందస్తు సమాచారం ఇచ్చి చేసే తనిఖీలకంటే ఆకస్మిక తనిఖీల ద్వారా వాస్తవ పరిస్థితులను గుర్తించే అవకాశం ఉంటుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యంగా రద్దీగా ఉండే సమయాల్లో వంట ప్రదేశాలు, నూనె వినియోగం, మాంసం నిల్వ, తాగునీరు, ఆహార పదార్థాల నిల్వ విధానం, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని వారు కోరుతున్నారు.

## ప్రజారోగ్యంపై రాజీ వద్దు

ఆహారం విక్రయించడం ఒక వ్యాపారం అయినప్పటికీ ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నాణ్యతా ప్రమాణాలు పాటించడం ప్రతి ఆహార విక్రయదారుడి బాధ్యత. అదే సమయంలో నిబంధనలు అమలు చేయడం సంబంధిత అధికారుల బాధ్యత. వ్యాపారులపై అనవసర ఇబ్బందులు లేకుండా, వినియోగదారుల ఆరోగ్యానికి హాని కలగకుండా చట్టపరమైన ప్రమాణాల ప్రకారం తనిఖీలు నిర్వహించి, లోపాలు ఉంటే సరిదిద్దేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## తనిఖీలు, పరీక్షలు, చర్యలకై ప్రజల డిమాండ్ ఇదే

ఖమ్మం నియోజకవర్గంలో పెరుగుతున్న బిర్యానీ కేంద్రాలు, దాబాలు, అల్పాహార కేంద్రాలు, వేయించిన పదార్థాల విక్రయ కేంద్రాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఆహార పదార్థాల నమూనాలు సేకరించి ప్రయోగశాల పరీక్షలు నిర్వహించాలని, వంట నూనెల నాణ్యతను పరిశీలించాలని, మాంసాహార పదార్థాల నిల్వ విధానాన్ని తనిఖీ చేయాలని, తాగునీటి నాణ్యతను పరీక్షించాలని, పరిశుభ్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయించాలని వారు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, ప్రజల ఆరోగ్యంతో చెలగాటానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620